జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 23 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 46 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: సప్తమి - 20:52:05 వరకు నక్షత్రంపునర్వసు - 20:58:22 వరకు కరణంగర - 09:48:22 వరకు, వణిజ - 20:52:05 వరకు పక్షంశుక్ల యోగంసుకర్మా - 06:07:23 వరకు, ధృతి - 27:32:01 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

**రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):** ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి

మిగతా1 2లో..

## ఆరుగురు ఐపీఎస్‌లకు డీజీ హోదా

**హైదరాబాద్,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):** తెలంగాణలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. 1995 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన

మిగతా 2లో..



# రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దు

### కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు సంచలన నిర్ణయం

### హైకోర్టు తీర్పుతో కేసీఆర్, హరీష్‌లకు ఊరట

### జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్,ఏప్రిల్22(ప్రజాజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందం టూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని

మిగతా 2లో..

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- పీసీ ఘోష్ కమిషన్ కాదు.. పీసీసీ నివేదిక
- కుట్రలు పక్కనపెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కేటీఆర్ హర్షం
- ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది
- హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి): కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్ర లని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.




హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు.

మిగతా 2లో..

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

**హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు**

**తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు**

**సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్,ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి):** కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

మిగతా 2లో..

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం
- అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు
- ప్రభుత్వ వైఫల్యాన్న బయటపెట్టిన హైకోర్టు తీర్పు
- విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి): కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన

మిగతా 12లో..

## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన ట్రంప్




వాషింగ్టన్,ఏప్రిల్22(ప్రజాజ్యోతి): ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంట ల్లో ముగియనుందనగా ట్రంప్

మిగతా 12లో..

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్




- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రీగా తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం
- ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు
- సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జెఎసి

హైదరాబాద్,ఏప్రిల్22(ప్రజాజ్యోతి): చాలాకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు

మిగతా 12లో..

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

**వెంటనే సమ్మె విరమించి రండి**

**ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి**

**హైదారబాద్,ఏప్రిల్22(ప్రజాజ్యోతి):** ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన

మిగతా 12లో..

## తమిళనాడులో నేడు ఒకే విడతలో పోలింగ్

**234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు**

**పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం**

**బెంగాల్లో 152 స్థానాలకు తొలి విడల పోలింగ్ ఏర్పాట్లు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. అలాగే బెంగాల్లో తొలిదశ పోలింగ్ జరుగనుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది సరంజామాతో తమకు అప్పగించిన కేంద్రాలకు చేరుకున్నారు. తమిళనాట మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. అధికారిక గణాంకాల ప్రకారం 5.73 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

మిగతా 2లో..

# పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత

- సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలి
- ప్రముఖ కంపెనీలకు తొలి విడతలో భూములు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన
- దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

**ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు**



హైదరాబాద్,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి): ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు .వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు.

మిగతా 12లో..

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్ రావు మృతి

**చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత**

**హైదరాబాద్,ఏప్రిల్22(ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి

మిగతా 12లో..

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

**హైదరాబాద్,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):** నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లోఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి

మిగతా 12లో..

# అన్ని మతాచారాలను ఒకే గాటిన కట్టలేం

**వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యం కూడా ముఖ్యం**

**శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం కేసు విచారణ**

**సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి): మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్సీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది.

మిగతా 12లో..

## గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండ

**మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా**

**కార్మిక మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**హైదరాబాద్,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గిగ్ వర్కర్ల కుటుంబ సభ్యులకు కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ఎక్స్‌గ్రేషియా చెక్కులను

మిగతా 2లో..

# సంపాదకీయం

## ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజులు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థైర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజులు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

## తమిళనాడులో నేడు ఒకే విడతలో పోలింగ్

మొదటిపేజీ తరువాయి..

4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది.

మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఇప్పటికే తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమాస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్‌పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. కొత్తగా సినీనటుడు విజయ్ టివికె పార్టీ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్ట్రాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతానని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీలో నిలిచారు. పశ్చిమబెంగాల్‌లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ తొలి విడతగా.. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు.

# రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దు




తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

మొదటిపేజీ తరువాయి..

అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు



అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు.

కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణెళీశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

మొదటిపేజీ తరువాయి..

నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉ



ల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

## ఆరుగురు ఐపీఎస్‌లకు డీజీ హోదా

మొదటిపేజీ తరువాయి..

మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు,1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్‌కుమార్, సజ్జనార్ కు డైరెక్టర్ జనరల్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

మొదటిపేజీ తరువాయి..

జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు.

**PUBLIC NOTICE**

This to inform to the general public at large that, my client Rajeshwar Apka S/o Ramulu R/o H. No. 1-23/2, Patnapur, Dist. Adilabad, that my client is owner of Plot No. 37, in Sy. No. 34/అ, situated at Village, G.P. & Mdl; Mavala, Dist. Adilabad, newly merged into Adilabad Municipality.

That it link document No. 911/2003 has lost.

If anyone has any claim, right, title or interest of any kind in the said property, they may contact the undersigned within 7 days of the publication of this Notice, with all documents of claim and title.

If any one finds the above document kindly handover to undersigned.

If anyone got/found the above document No. 911/2003, they shall hand over to my client or can hand over to the address below.

If no objection is received within 7 days, and if any claim and objection arise, it shall be deemed to have been waived.

Dt. 22-04-2026.

**Bipin Kumar Patel**
Advocate,
ADARSH Building,
N.H.No.44, Adilabad
Cell: 9440005500

## గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండ

మొదటిపేజీ తరువాయి..

అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గిగ్ వర్కర్లు లోకుర్తి నరేష్, జీ. శ్యామ్ సుందర్ మరియు అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్ కుటుంబ సభ్యులకు మంత్రి స్వయంగా చెక్కులు అందజేశారు. సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్లకు అండగా నిలుస్తూ అసెంబ్లీలో గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ చట్టాన్ని ఆమోదించిందని తెలిపారు. గిగ్ వర్కర్లకు ఇలాంటి రక్షణ, భద్రతా వలయం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఏ కార్మికుడికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లు అయినా, హమాలీలు అయినా అందరికీ ప్రభుత్వం నుండి తగిన సహాయం, పరిరక్షణ అందాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గిగ్ వర్కర్ల యూనియన్ కీలక పాత్ర పోషించిందని, వారు కార్మిక శాఖ



అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ చర్యలను సాధ్యంచేసారని మంత్రి అభినందించారు. ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ గిగ్ వర్కర్లు మరియు బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేయదని, వారి హక్కులు మరియు సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ ఈ. గంగాధర్, గిగ్ వర్కర్ల యూనియన్ నాయకుడు సలావుద్దీన్ మరియు ఇతరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించడంతో పాటు తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

**CHANGE OF NAME**

I, **MEKALA SAMMAIAH,** (New Name) R/o Krishna Nagar Village, Sangem Mandal, Warangal District. I Have Changed my name From **MEKALA SAMBAIAH** (Old Name) to **MEKALA SAMMAIAH** (New Name) for all Future Purposes.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్





**నేరడిగొండ, ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి :** నేరడిగొండ మండల కేంద్రంలో బుధవారం నాడు నిర్వహించిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల నర్సయ్య మరియు లక్కవత్తుల శేఖర్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల సొంతింటి కల సాకారం కావడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

**పాల్గొన్న ముఖ్య నాయకులు :** ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు: రాథోడ్ సజన్ మాజీ ఎంపీపీ నీలిమ రవీందర్ రెడ్డి,నేరడిగొండ సర్పంచ్ సబ్లె సంతోష్ సింగ్ నాయకులు వీరితో పాటు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన గృహ ప్రవేశాల నేపథ్యంలో ఆయా కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్‌కు హిందూ సమ్మేళన సమితి ఆహ్వానం

- హిందూ సమ్మేళనానికి రావాలని అడిషనల్ ఎస్పీకి విజ్ఞప్తి
- ప్రమోషన్ పొందిన ఎస్పీకి శాలువాతో సన్మానం



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి :** ఇటీవల అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా పదోన్నతి పొందిన చిత్తరంజన్‌ను హిందూ సమ్మేళన సమితి సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనను కలిసిన సమితి ప్రతినిధులు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 24వ తేదీన ఆసిఫాబాద్‌లోని ప్రేమల గార్డెన్‌లో నిర్వహించనున్న హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆయనను కోరారు. హిందూ ధర్మ పరిరక్షణ, సామాజిక ఐక్యత, సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు భోనగిరి సతీష్ బాబు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సమితి సభ్యులు కొనియాడారు. ప్రజలందరూ కులమతాలకతీతంగా కలిసిమెలిసి ఉండాలని, సమాజ శ్రేయస్సు కోసం అందరూ కృషి చేయాలని ఈ సమ్మేళనం ద్వారా సందేశమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గందం శ్రీనివాస్, సమితి ఉపాధ్యక్షులు కాంద్రే విశాల్, నాగుల శ్రీనివాస్, సభ్యులు గుండేటి కోటేశ్వరరావు, ఇదులవాడ గణేష్, జాడి అశోక్, జాబరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా గురుకుల కళాశాలలో అధ్యాపకులకు పురస్కారాలు





**మంచిర్యాల, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మంచిర్యాలకు చెందిన పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ మద్దెల జ్యోతి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికై, కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామాక పాండురంగ శర్మతో పాటు సహోద్యోగులు ఆమెకు అభినందనలు తెలిపారు. అలాగే కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. అనూష ఉత్తమ సేవలను గుర్తించి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్) ఆధ్వర్యంలో కాళేశ్వరం జోన్ పరిధిలో ఉత్తమ ఎంప్లాయ్ అవార్డును జోనల్ ఆఫీసర్ చి. గిరిజ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.పాండురంగ శర్మతో పాటు సహోద్యోగులు, విద్యార్థులు డాక్టర్ అనూషకు అభినందనలు తెలిపారు.

## పట్టణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి







**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఎప్రిల్ 22, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారు అన్నారు. పట్టణంలోని విస్డమ్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ పిల్లల నడవడికపై దృష్టి సారించాలని, పిల్లకు మంచి భవిష్యత్తు లభించాలంటే సమాజంలో ఏది మంచిది, ఏది చెడు అన్న విషయాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత దురలవాట్లకు ఆకర్షితులు అవుతున్నారని, గంజాయి లాంటి అలవాట్లకు బానిసవుతున్నారని తల్లి తండ్రులు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సందర్భంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గా పట్టణ వాసులను కోరేది ఒకటేనని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పిల్లలు స్కూల్ కి వెల్లే సమయంలో బస్ వద్దకు వెళ్లాలన్న చేతిలో కట్టె పట్టుకొని ఒకరు సెక్యూరిటీ గార్డ్ గా వెళ్ళాల్సిన పరిస్థితి ఉందని, అందుకే గత మూడు రోజులుగా పట్టణంలో కోతులను పట్టుకొని దూరపు అటవీ ప్రాంతంలో వదిలేసే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పట్టణ ప్రజల అవసరాలపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించ్చిందని , ప్రజలు సహకరించినప్పుడే పాలనలోనూ, అభివృద్ధిలోను విజయవంతంగా ముందుకు సాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు సముందర్ పల్లి రాజు, ఆకుల రామకృష్ణ, అడప పోశెట్టి, లక్కాకుల హరీష్, శనిగారపు నరేష్, పెందం శ్రీనివాస్, యూనిస్, గుంజాల చైతన్య, మాజీ కౌన్సిలర్ ధర్మాజీ గారి శ్రీనివాస్, నాయకులు మూట సురేష్, అడప శ్రీకాంత్, అనిల్, అల్మాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం - ఆడే గజేందర్





**నేరడిగొండ, ఏప్రిల్ 22: ప్రజాజ్యోతి :** మండలంలోని కొర్టికల్ (బి) గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. లబ్ధిదారుల ప్రత్యేక ఆహ్వానం మేరకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్ తో కలిసి ఆయన లబ్ధిదారుల ఇళ్ల వద్ద పూజా కార్యక్రమాల్లో పాల్గొని, రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజంగా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని కొనియాడారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆకాంక్షించారు. గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## బంబారా గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం విజయవంతం

### బాలవివాహాల నిర్మూలనపై కీలక చర్చ



**కొమురం భీం జిల్లా ప్రజా జ్యోతి క్రైమ్ రిపోర్టర్ ఏప్రిల్ 22 :** వాంకిడి మండలం బంబారా గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో బాలల భద్రత, విద్య, ఆరోగ్యం మరియు హక్కుల పరిరక్షణ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి బలరక్ష భవన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ పితంబర్ ముఖ్య అతిథులుగా హాజరై బాలల సంక్షేమంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలవివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. సమావేశంలో బాలవివాహం చట్ట విరుద్ధమని, ఇది బాలల భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేసే సామాజిక సమస్య అని వివరించారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల బాలికల ఆరోగ్యం, విద్య మరియు సమగ్ర అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాలు పడతాయని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో బాలవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ జాడి సంతోష్, పంచాయతీ కార్యదర్శి దుర్గం ధర్మయ్య, రాము, తిరుపతి తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. బాలల సంక్షేమం కోసం గ్రామస్థులందరూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని సూచించారు. ఈ కార్యక్రమం గ్రామంలో బాలల పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించిందని, బాలవివాహాల నిర్మూలన కోసం నిరంతరం కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## మార్లవాయి గ్రామ అభివృద్ధికి వినతి

- మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన సర్పంచ్ కనక ప్రతిభ
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కతో కలిసి వినతిపత్రం సమర్పణ



**కొమురం భీం జిల్లా ప్రజా జ్యోతి క్రైమ్ రిపోర్టర్ ఏప్రిల్ 22 :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, జైనూర్ మండల పరిధిలోని మార్లవాయి గ్రామ అభివృద్ధి కోసం గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కతో కలిసి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. మార్లవాయి గ్రామం చారిత్రాత్మక ప్రాధాన్యం గల ఆదివాసీ గ్రామంగా ప్రసిద్ధి చెందింది. ప్రముఖ మానవ శాస్త్రవేత్త క్రిస్టోఫ్ వాన్ ఫ్యూరర్-హైమెండార్ఫ్ మరియు ఆయన సతీమణి నివసించిన గ్రామంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. గతంలో మంత్రి జూపల్లి కృష్ణారావు గ్రామాన్ని సందర్శించి ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో గడిపి గ్రామ ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకున్నారు. అయితే అప్పట్లో మంజూరైన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం లేదా ఆలస్యమవుతున్నాయని సర్పంచ్ కనక ప్రతిభ మంత్రి గారికి వివరించారు.

ప్రధాన వినతులు: మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలి. రాగాపూర్ – మార్లవాయి ప్రధాన రహదారిని శాశ్వతంగా నిర్మించాలి. హైమెండార్ఫ్ దంపతుల సమాధులను "శృతి వనం"గా అభివృద్ధి చేయాలి. గోండ్వానా పంచాయతీ రాజ్ సెంటర్, ప్రజాదర్బార్ వేదిక ఏర్పాటు చేయాలి. కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలి. పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి. ఆశ్రమ పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలి. హెల్త్ సబ్ సెంటర్, పాఠశాలలు, మహిళా భవనాలకు ప్రహరీ గోడలు నిర్మించాలి. డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి.

మంచినీటి సమస్య పరిష్కారానికి బోర్‌వెల్స్, హ్యాండ్ పంపులు ఏర్పాటు చేయాలి. ఈ వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడమే కాకుండా కొత్త అభివృద్ధి పనులను కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు మంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, మార్లవాయి గ్రామం త్వరలోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలి

- పీఆర్సీల అమలు, ఉద్యోగ భద్రత కల్పించాలి
- మంచిర్యాల డిపోలో ప్రారంభమైన సమ్మె
- ప్రైవేటు బస్సులను అడ్డుకున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు
- సమ్మె సందర్భంగా ఉద్రిక్తత







**మంచిర్యాల, 22, ఏప్రిల్ (ప్రజాజ్యోతి) : టిజి ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో** విలీనం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంచిర్యాల డిపో జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. మంగళవారం రాత్రి ప్రారంభమైన ఈ సమ్మె బుధవారం మరింత ఉద్ధృతమైంది. ఈ సమ్మెలో మంచిర్యాల డిపో జేఏసీ చైర్మన్,వైస్ చైర్మన్, కోశాధికారి మామిడిపెల్లి శ్రీనివాస్, కన్నూరు (బొట్టు) లక్ష్మణ్, సేని తిరుపతి, సుదర్శన్ రెడ్డి, తోట సత్తయ్య,జేఏసీ సభ్యులుగా పోలు రాజేశం, గాదె శంకర్, గాదె భాస్కర్, అప్పారావు, మేకల మల్లేష్, చుంచు వెంకటేష్, బ్రేక్ శ్రీనివాస్, ఏ.ఎం. ఖాన్, మెకానిక్ శంకరయ్య, జ్యోతి, ఉమా రాణి, అనూష, చంద్రకళలు,, రాచర్ల శ్రీధర్‌తో పాటు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 2021--25 మరియు 2025--27 పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని, కొత్త డ్రైవర్లు, కండక్టర్ల నియామకం చేపట్టాలని, కొత్త బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీని బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాల ఆర్టీసీ డిపో ముందు బైఠాయించారు. డిపో లోపల నుంచి బస్సు రాకుండా అడ్డుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె నేపథ్యంలో డిపో ముందు డ్రైవర్లు, కండక్టర్లు, మహిళా సిబ్బంది పెద్ద సంఖ్యలో చేరుకుని నినాదాలు చేశారు. తమ న్యాయమైన కోరికలు నెరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తా మని స్పష్టం చేశారు.సమ్మె ప్రభావంతో మంచిర్యాల జిల్లా నలుమూలల్లో రవాణా వ్యవస్థ దాదాపు స్తంభించిపోయింది. ప్రతిరోజు వచ్చే లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. ఆర్టీసీ ప్రైవేటు బస్సులు కొన్ని నడిచినా ప్రభుత్వ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు ఈ సందర్భంగా తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక సమ్మె ప్రభావాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రైవేటు బస్సులను నడిపించే ప్రయత్నాలు చేయగా, వాటిని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అడ్డుకోవడం వల్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు బస్సులను అడ్డుకోవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ ప్రకాశ్ హెచ్చరించారు. మరోవైపు, ప్రైవేటు బస్సుల నిర్వహణపై కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దీని వల్ల భవిష్యత్తులో ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమ్మెకు సిపిఐ, ఐఎఫ్టియూ తదితర కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. సమ్మె విషయం తెలియక వచ్చిన వారు బస్సుల కోసం నిరీక్షిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ప్రైవేటు బస్సులను నడిపించే ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను విరమించబోమని కార్మికులు స్పష్టం చేశారు.

## అంగన్వాడీలకు 'స్మార్ట్' భరోసా

### సోనాలలో 5జీ ఫోన్ల పంపిణీ



**సోనాల మండలం. ఏప్రిల్, 22 (ప్రజాజ్యోతి) :** అంగన్వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు మరియు డిజిటల్ సేవలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. బుధవారం సోనాల మండల పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్లకు అత్యాధునిక 5జీ స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోనాల గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సోనాల సర్పంచ్ యల్ల బిందుజ సుధీర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వెంకట రమణ. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మౌనిక మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేతాజీ పబ్లిక్ పాఠశాలలో విడుకోలు కార్యక్రమం



**సారంగాపూర్, ఏప్రిల్ 22, ప్రజాజ్యోతి :** కౌట్ల (బి)గ్రామంలో ఉన్న ప్రైవేట్ నేతాజీ పాఠశాల బుధవారం ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఉపన్యాసం అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ప్రతి సంవత్సరం గురుకుల కోచింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా 30 గురుకుల సీట్లు సాధించి మండలంలోని మొదటి స్థానంలో నిలిచిందని,ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా వచ్చిన మండల విద్యాధికారి మహేందర్ సార్ పాఠశాల యాజమాన్యానికి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట గంగాధర్, కరస్పాండెంట్ కిష్టయ్య,ఉపసర్పంచ్ ఇప్ప శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, గ్రామ కార్యదర్శి సుధాకర్, మ్యాక్స్ ప్రెసిడెంట్ భూమారెడ్డి, ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, నవీన్, నారాయణ, పోశెట్టి,రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## మూగజీవాల దాహార్తి తీర్చిన పీచర సర్పంచ్



**నేరడిగొండ, ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి :** మండలంలోని లక్ష్మీపూర్ మరియు తిమ్మాపూర్ గ్రామాల్లో పశువుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వేసవి కాలం సమీపిస్తుండటంతో ఈ గ్రామాల్లో పశువులకు నీరు దొరక్క మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన పీచర గ్రామ సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ తక్షణమే స్పందించారు. తన సొంత చొరవతో పశువుల కోసం ప్రత్యేకంగా నీటి తొట్టిని నిర్మించి, నీటి సౌకర్యాన్ని కల్పించారు. దీంతో గత కొద్దిరోజులుగా నీటి కోసం అల్లాడుతున్న పశువులకు ఉపశమనం లభించింది. మూగజీవాల పట్ల సర్పంచ్ చూపిన ఈ దయాగుణం మరియు సమయస్ఫూర్తిని చూసి స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. "పశువుల దాహార్తిని గుర్తించి, వాటి కోసం నీటి తొట్టిని ఏర్పాటు చేసిన సర్పంచ్ రాజేందర్ కి ప్రత్యేక ధన్యవాదాలు" అని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న సర్పంచ్ పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## లెనిన్ జయంతి సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ

### ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌స్టార్ సేవా కార్యక్రమం



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి :** లెనిన్ జన్మదినం, సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గోగార్ల తిరుపతి మాట్లాడుతూ.. 22 ఏప్రిల్ 1969న సీపీఐ (ఎంఎల్) స్థాపించబడిందని, లెనిన్ జన్మదినమైన ఏప్రిల్ 22ను పార్టీ ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 1920లో తాష్కెంట్‌లో మహమ్మద్ షఫీఖ్ కార్యదర్శిగా సీపీఐ స్థాపించబడిందని, బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన ఘన చరిత్ర ఆ పార్టీకి ఉందని గుర్తుచేశారు. అయితే భారతదేశంలోని కులవ్యవస్థకు, వర్గ నిర్మాణానికి మధ్య గల విడదీయరాని సంబంధాన్ని గుర్తించడంలో సీపీఐ విఫలమైందని, సవరణవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఫలితంగా 1964లో సీపీఎం ఏర్పడినా అది కూడా సవరణవాద వైఖరుల నుంచి బయటపడలేక పోయిందని పేర్కొన్నారు. 1967 మేలో జరిగిన నక్సల్బరీ తిరుగుబాటు తర్వాత సీపీఎం నూతన సవరణవాదానికి వ్యతిరేకంగా జరిగిన సైద్ధాంతిక రాజకీయ పోరాటమే 22 ఏప్రిల్ 1969న సీపీఐ (ఎంఎల్) ఏర్పాటుకు దారితీసిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో 1738 ఎకరాల్లో పంట నష్టం

గద్వాల ఏప్రిల్ 22(ప్రజా జ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఐజ,రాజోలి మండలాల్లో రైతులు సాగు చేసిన వరి పంట మంగళవారం కురిసిన వర్షానికి 1738 ఎకరాలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లాలో



మంగళవారం వడగండ్లతో కూడిన అకాల వర్షం కురవడంతో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ,ఐజ,రాజోలి మండలాల్లోని మాన్ ధొడ్డి,ననూరు,పచ్చర్ల,చిన్న తాండ్రపాడు,ఉప్పల్,చిన్న ధన్వాడ తదితర గ్రామాలలో యాసంగి 2025-26 లో సాగు చేసిన వరి పంట మొత్తం విస్తీర్ణం లో 1738.34 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామ న్నారు.80% పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపటం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప మాన్ దొడ్డి గ్రామంలో రైతులు నష్టపోయిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ పర్యటనలో ఏడీఏ సక్రియ నాయక్,రాజోలి మండల వ్యవసాయ శాఖ అధికారి సురేఖ,ఏఈఓ శ్వేత, తదితరులున్నారు.

# సమిష్టి కృషితోనే విజయ శిఖరాలు

- ఎల్ఐసి జడ్చర్ల బ్రాంచ్ వార్షిక లక్ష్య సాధన వేడుకలు ఘనంగా

జడ్చర్ల టౌన్ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి ): ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సిబ్బంది సమిష్టి కృషితోనే విజయ శిఖరాలను సులభంగా అధిరోహించవచ్చని ఎల్ఐసి ఆఫ్ ఇండియా హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజినల్ మేనేజర్ సంధ్యారాణి పేర్కొన్నారు. జడ్చర్ల బ్రాంచ్ ఎన్ఓపీ వార్షిక బడ్జెట్ సాధనకు అదే ప్రధాన



కారణమని ఆమె తెలిపారు. బుధవారం జడ్చర్ల ఎల్ఐసి బ్రాంచ్ కార్యాల యంలోని ఏటీపీ హాల్‌లో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎల్. శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక బడ్జెట్ సాధన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సీనియర్ డివిజినల్ మేనేజర్ సంధ్యారాణి, డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ ఎం. ప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ జడ్చర్ల బ్రాంచ్ లక్ష్య సాధనలో చూపిన కృషి ప్రశంసనీయమని అన్నారు. ఇదే టీమ్ స్పిరిట్‌తో భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ కస్టమర్ సేవలో నిబద్ధతతో పనిచేస్తే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బీమా సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో క్లియా మేనేజర్ రవిశంకర్, డివిజన్ సేల్స్ మేనేజర్ రవీందర్, బ్రాంచ్ ఏబీఎం సేల్స్ రవీందర్ తదితరులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏజెంట్లను సన్మానించారు.

# సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి బ్యూరో): మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం బుధవారం మెట్టుగడ్డలోని శిశు గృహ (స్టేట్ హోమ్) కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, టీజీవీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులకు స్కూటీలు, ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, వినికిడి మరియు చూపు లోపం ఉన్న వారికి అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో రూ.150 కోట్లను



కేటాయించిందని చెప్పారు. రాబోయే బడ్జెట్‌లో దివ్యాంగుల శాఖకు ప్రత్యేక నిధులు కేటాయించే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో 4% ఉద్యోగ రిజర్వేషన్, వివిధ పథకాలలో 5% రిజర్వేషన్ అమలుకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. దివ్యాంగుల వివాహాలకు ప్రోత్సాహకంగా రూ.2 లక్షలు, దివ్యాంగులు-సకలాంగుల వివాహానికి రూ.1 లక్ష సహాయం అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగులకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓలను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. సహాయ ఉపకరణాలు అందుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ గుమ్మాల మమతా మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లూయిస్ బ్రెయిలీ విగ్రహ స్థాపనకు స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అధికారి ఇందిరా మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన న్యాయ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డీఆర్‌డీఓ అధికారి నర్సింహులు సదరం, యూడీఐడీ కార్డుల్లో అవకతవకలు నివారించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలను దివ్యాంగులకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, దివ్యాంగుల సంఘ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో రైతులు, మహిళలకు ప్రాధాన్యం: ఎంపీ మల్లు రవి

- సన్నరకం వరికి బోనస్ రైతులకు ఊరటనిచ్చే నిర్ణయం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి): ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తూ సంక్షేమ పథకాల అమలులో ముందంజలో ఉందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి





పేర్కొన్నారు. సన్నరకం వరి ధాన్యానికి బోనస్ ప్రకటించి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. బుధవారం పెద్దమందడి మండల కేంద్రం, వెల్టూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలిసి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కేంద్రాలను ప్రారంభించిన అనంతరం వడ్ల సంచులను తూకంపై ఉంచి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తెచ్చే ధాన్యంలో తేమ శాతం పరిశీలించిన వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి, ట్యాబ్ ఎంట్రీలు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు వారం రోజుల్లోనే చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ సన్నరకం వరికి బోనస్ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం రైతులకు మద్దతు అందిస్తోందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని లాభపడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా వ్యవహరించి రైతులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ

వెల్టూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేశారు. ఇల్లు లేని నిరుపేదలకు నివాస సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డీఆర్‌డీఓ ఉమాదేవి, డీసీఎస్‌ఓ కాశీ విశ్వనాథ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీ మల్లు రవి

- బుద్ధారం గ్రామంలో యూనియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం
- రైతులు, ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యత రుణాలు ఇవ్వాలి
- గోపాల్పేటలో సైన్స్ ల్యాబ్, హైమాస్ట్ లైట్లు ప్రారంభం

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి): వనపర్తి, నాగర్ కర్నూలు, గద్వాల జిల్లాలకు లీడ్ బ్యాంక్‌గా సేవలందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పనితీరు ప్రశంసనీయ మని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. బుధవారం గోపాల్పేట మండలం బుద్ధారం గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామంలో 694వ బ్రాంచ్ ప్రారంభం అభినందనీయమన్నారు. బ్యాంకులు రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ లకు ప్రాధాన్యతగా రుణాలు అందించాలని సూచించారు. రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, యువతకు నైపుణ్య శిక్షణ, గ్రామీణ ఉపాధి కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ రైల్వే లైన్ కోసం పార్లమెంటులో కృషి చేస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి




మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరించడం అభివృద్ధికి దోహదమ న్నారు. ప్రజలు బ్యాంకు సేవలను వినియోగించు కోవాలని కోరారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ కొత్త బ్రాంచ్ గ్రామ అభివృద్ధికి ఉపయోగపడుతుం దని అన్నారు.

సైన్స్ ల్యాబ్ ప్రారంభం

గోపాల్పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద రూ.13.50 లక్షల వ్యయంతో నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అలాగే రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కూడా ప్రారంభించారు. అంతకుముందు బుద్ధారం గ్రామ శివారులో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, యూనియన్ బ్యాంక్ సీజీఎం రవీంద్రబాబు, ఆర్ఎం వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, ప్రజాప్రతిని ధులు, అధికారులు పాల్గొన్నారు.

# నవాబ్‌పేట్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీపై ప్రత్యేక దృష్టి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి బ్యూరో): జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం నవాబ్‌పేట్ మండలంలో పర్యటించి తహసీల్దార్ కార్యాలయం, కస్తూర్బా గాంధీ బాలిక





విద్యాలయం (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూ భారతి, భూమి సర్వే, పెండింగ్ ఫైళ్లపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలను ప్రజలకు వేగంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఆలస్యంగా హాజరవుతున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ ఇకపై సమయపాలన కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ 9వ తరగతి విద్యార్థినులతో మాట్లాడి విద్య, వసతి, ఆహార సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, ఉపాధ్యాయులు సక్రమంగా బోధిస్తున్నారా అనే అంశాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం, హిమోగ్లోబిన్ పరీక్షలపై కూడా వివరాలు తెలుసుకున్నారు.

పాఠశాలలో మరుగుదొడ్లు, స్నానాల గదులు, త్రాగునీటి సదుపాయాలను పరిశీలించారు. ఆర్.ఓ ప్లాంట్ పనిచేయకపోవడం గమనించి వెంటనే మరమ్మతులు చేసి శుద్ధమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. వంటగది, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తదుపరి పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు తెలుసుకు న్నారు. ఆసుపత్రిలో ఫ్యాన్లు తక్కువగా ఉండడం గమనించి వేసవి తీవ్రత దృష్ట్యా వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు.

అవుట్‌పేషంట్, ఇన్‌పేషంట్ వివరాలను పరిశీలించి, అవసరమైన ఔషధాల నిల్వలపై సమీక్షించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ల జారీలో సర్కారు అట్టర్ ఫ్లాప్

- పాత్రికేయుల సమస్యలపై సమిష్టి పోరాటానికి పిలుపు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి బ్యూరో): జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన కొత్త అక్రెడిటేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని ధ్వజమెత్తారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని కెమిస్ట్ డ్రగిస్ట్ భవన్‌లో నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా కనీసం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేకపోయిం దని అన్నారు.

జర్నలిస్టుల పట్ల గతంలో ఎన్నడూ లేని విధంగా వివక్ష, నిర్లక్ష్యం కొనసాగుతోందని, గడిచిన రెండేళ్లలో వారి సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని విమర్శించారు. అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ మాటల్లోనే తప్ప అమలులో కనిపించడం లేదని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం కూడా ముందుకు సాగడం లేదని, చిన్న, మధ్య తరహా పత్రికలకు రెండేళ్లుగా ప్రకటన బిల్లులు చెల్లించడంలేదని ఆరోపించారు. ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరిని ఎదిరిస్తూ ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని మామిడి సోమయ్య పిలుపుని చ్చారు.



ఈ సమావేశంలో రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, ఎం. యాదగిరి, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు మోయిజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహ్మద్ రఫీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ్మా, కార్యదర్శి ఎం. గోపాల్, కోశాధికారి నర్సింహులు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవి కుమార్, కో-కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై హైకోర్టు తీర్పుతో న్యాయం గెలిచింది

జడ్చర్ల టౌన్ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి బ్యూరో): కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం గెలిచిందని మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి తెలిపారు.



కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం సత్యానికి న్యాయం జరిగినట్లేనని అన్నారు. తెలంగాణను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అడ్డగోలుగా విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించాయని ఆయన ఆరోపించారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. న్యాయస్థానాలపై నమ్మకంతో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, టి. హరీష్ రావు పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్యలు, వేధింపులు మానుకొని పాలనపై దృష్టి సారించాలని సూచించారు. కోర్టు తీర్పుతో అయినా కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు కనువిప్పు కలగాలని ఆకాంక్షించారు.

# నూతన డాక్టర్ సెల్ జిల్లా డిసిసి అధ్యక్షురాలు డాక్టర్ గీత కి పూలే అంబేడ్కర్ జాతర ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం

నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) నారాయణపేట జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షురాలుగా నియమతులైన డాక్టర్ గీత మేడం గారికి అభినందనలు తెలిపిన నారాయణపేట



పూలే అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ గీత మేడం గారికి శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో 4 వ పూలే అంబేడ్కర్ జాతర అధ్యక్షుడు యు. మహేష్ చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి టి .మాధవ్ ప్రజా కళా మండలి జిల్లా అధ్యక్షుడు రమేష్ చేయూత స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు సోఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ గురుకుల పాఠశాల తనిఖీ చేసిన జెడ్పీపీ సీఈఓ

## విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

జడ్చర్ల టౌన్ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి ): సంక్షేమ వారోత్సవాలు మరియు "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీపీ సీఈఓ ఎస్. వెంకట్ రెడ్డి జడ్చర్ల మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా



కొత్తతండ, పోచమ్మగడ్డ తండ గ్రామాల్లోని మెయిన్ ఎస్టీ గురుకులం (గర్ల్స్) పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి చదువు, వసతి, ఆహార సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, పారిశుధ్య సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి విద్యార్థులందరికీ పరిశుభ్రమైన, పోషకా హారంతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సు విషయంలో రాజీపడకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె బాట

## బస్సులు బంద్ ప్రయాణికులకు ఇబ్బందులు

కల్వకుర్తి, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి ) : తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు బుధవారం సమ్మె బాట పట్టారు. ప్రభుత్వంతో నిర్వహించిన చర్చలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు తమ విధులను బహిష్కరించారు. దీంతో బస్సులన్ని డిపోలకే పరిమితం అయ్యాయి.ఈ సమ్మె కారణంగా కల్వకుర్తి డిపోలో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కార్మిక సమస్యలను పరిష్కరించాలని తెల్లవారుజాము నుండే డిపోల ముందు బంద్ పాటించారు. డిపోలో పలు గ్రామాల బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ఉదయం నుంచి



విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని అదుపులో ఉంచడానికి ప్రభుత్వం బస్ డిపో వద్ద భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. కల్వకుర్తి డిపోలో 98 బస్సులు డిపోకే పరిమితం కాగా, సుమారు 260 మంది ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు. డిపో గేట్ల ముందు బైఠాయించిన కార్మికులు, విధులకు వచ్చే కాంట్రాక్టు ఉద్యోగులను అడ్డుకున్నారు. ముఖ్యంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, పెండింగ్‌లో ఉన్న పే-స్కేల్ను అమలు చేయడం, యూనియన్లను పునరుద్ధరించడం వంటి 32 ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మన భూమి - మన బాధ్యత

- షేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం





**ఖానాపూర్, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి) :** మన భూమి-మన బాధ్యత అని షేర్ సేవా సంస్థ కో ఆర్డినేటర్ శిరీష పేర్కొన్నారు. షేర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఖానాపూర్ మండలం వజినేపల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో షేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి సూచనలతో మన శక్తి మన భూమిపై జరిగిన అవగాహనా కార్యక్రమం ప్రిన్సిపాల్ అనిత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డిసిపిఒ ఉమా పాల్గొని మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ భూమిని రక్షించడం కొరకు ప్రజలకు అవగాహనా కల్పించడం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22 తారీఖున జరుపుకుంటామని కావున ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ చేయాలని పిలుపునిచ్చారు. షేర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి వేసవి సెలవుల్లో ఇంటి దగ్గర మొక్కలు నాటలని, భూమి తప్పని తగించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ అనిత పర్యావరణం పై అవగాహనా కల్పించారు అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలోచైల్డ్ లైన్ కేసు వర్కర్ మౌనిక షేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రశాంతి, కల్పన, గాయత్రి, ప్రభాకర్ ,పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు





**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, ఏప్రిల్ 22 :** ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని చేస్తున్న సమ్మెకు ఏ.ఐ.టీ.యూ.సీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోటపలుకుల రమేష్, క్యాతరాజు సతీష్ మాట్లాడుతూ,ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన డిమాండ్లను నెరవేర్చాలని వారు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించి వెంటనే వాళ్లను చర్చలకు పిలిచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వారి డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .లేనియెడల ఆర్టీసీ కార్మికులకుఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేసి వారితోపాటు వారి సమ్మె విజయవంతము అయ్యే వరకు ప్రతి కార్యక్రమాల్లో ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం వారి వెంట ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీఈసీ నాయకులు సుధాకర్ రెడ్డి ,వేముల శ్రీకాంత్ ,నేరెళ్ల జోసెఫ్, బాబురావు, పొన్నగంటి లావణ్య తో పాటు ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలో చలివేంద్రాల ఏర్పాటు

- ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి



**నర్సంపేట ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట నియోజకవర్గం, నర్సంపేట పట్టణం,ఎండాకాలంలో రోజు రోజుకి ఎండల తీవ్రత పెరుగుతున్నా క్రమంలో బాటసారులు సాధారణ ప్రజలకు త్రాగు నీటికి ఇబ్బంది కలగకుండా అంగడి సెంటర్ లో వరంగల్ రోడ్ చౌరస్తా దగ్గర జనతా ట్రస్ట్ కుటుంబ సభ్యులు జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు చేసి, ప్రారంభించిన జనతా ట్రస్ట్ చైర్మన్ డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పుట్టపాక రవి,దొడ్డ రవీందర్,శ్రీరాం కిరణ్,గండు నవీన్, శీలం సత్యనారాయణ గూడూరు సందీప్, తనుగుల అంబేద్కర్, దుంకదువ్వ రంజిత్ కొంకిస విఘ్నేష్,శీలం భానుప్రసాద్, పెంతల శ్రీకాంత్ రెడ్డి,అబ్బరబోయిన రాజు, సూత్రపు సరిత, గుర్రపు నరేష్, ఠాకూర్ విజయ్ సింగ్,కాసుల నాగేంద్ర బాబు, బోయిని సుధాకర్ ,తిమ్మాపురం శివ సామల ప్రవీణ్,తప్పెట్ల సతీష్,గోస్కుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించుకోవాలి

- జిల్లా సహకార అధికారి నీరజ



**రాయపర్తి,ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి :** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు, ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా సహాయ అధికారి నిరజ అన్నారు. మంగళవారం మండలం లోని రాయపర్తి,కొండూరు, జయరాం తండా ఎస్ కేశవాపురం గ్రామాలలో పి ఏ సి ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల ను ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, సర్పంచుల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి సూచించారు. తేమ తరుగు లేకుండా శుద్ధి చేసిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు సొసైటీ ప్రత్యేక అధికారి కీరు నాయక్ గ్రామాల సర్పంచులు గారి సయేంద్ర బిక్షపతి, యాకన్న, సుధాకర్, కార్యదర్శులు సోమిరెడ్డి, యాదగిరి, రైతులు పాల్గొన్నారు

## వైభవంగా భద్రకాళీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు









### నాలుగో రోజు ఘనంగా నిర్వహణ

**హనుమకొండ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) :** వరంగల్ మహానగరంలో చారిత్రక ప్రాధాన్యం గల శ్రీ భద్రకాళీ దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ భద్రకాళీ--భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు నాలుగో రోజుకు చేరుకొని అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం చతుఃస్థానార్చన, ఉత్సవాంగ నిత్యబలి కార్యక్రమాల అనంతరం అమ్మవారిని దుర్గామాతగా అలంకరించి సింహవాహనంపై ఊరేగించారు. సాయంత్రం గజవాహనంపై శ్రీలక్ష్మీమాతగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో భక్తుల నడుమ వైభవంగా ప్రదర్శించారు.అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ మండపంలో శ్రీ భద్రకాళీ--భద్రేశ్వరుల కళ్యాణ సుందర మూర్తులను వేంచేపు చేసి అర్చకుల సమన్వయంతో కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ తంతు భక్తులకు దివ్యానుభూతిని కలిగించింది.ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలైన ఆర్యవైశ్య (పట్టణ) సంఘం, పూజాదికాలు నిర్వహించగా, మధ్యాహ్నం దాదాపు 2000 మంది భక్తులకు అన్నదానం చేశారు.ఈ సేవ భక్తుల ప్రశంసలను అందుకుంది. కార్యక్రమంలో మాజీ మేయర్ గుండా ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తౌనుపునూరి వీరన్న, వీరమల్లయ్య, అయితా గోపీనాథ్, అల్లాడి వీరభద్రయ్య, అయితా ప్రసాద్, పొలారపు కృష్ణమూర్తి తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అభిషేకం అనంతరం ముత్తయిదువులు సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించగా, సాయంత్రం గజవాహన సేవను చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం, వరంగల్ ఉమ్మడి జిల్లా సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరయోగుల సురేష్--రమాదేవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన కళ్యాణోత్సవంలో శాస్త్రోక్తంగా వివిధ తంతువులు నిర్వహించారు.కన్యాదానం, మంగళ్యధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ముఖ్య అర్చకులు పార్నంది నర్సింహమూర్తి, చెప్పెల వెంకటనాగరాజ శర్మ, వేదపాఠశాల అధ్యాపకులు తాతాభట్ల నర్సింహశర్మల ఆధ్వర్యంలో ఈ తంతు నిర్వహించబడింది.ఈ సందర్భంగా ప్రముఖ అద్వైత వేదాంత పండితుడు బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ గారు నిర్వహించిన "శివకళ్యాణ వైభవము" ప్రవచనం భక్తులను మంత్రముగ్ధులను చేసింది.ఆలయ ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వాతావరణం, వేదమంత్రాలు, విద్యుద్దీపాల కాంతులు భక్తులకు మరపురాని అనుభూతిని కలిగించాయి.కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు ప్రసాదంగా విందు భోజనం అందజేశారు.పూలు, మామిడాకులు, అరటిచెట్లతో అలంకరించిన కళ్యాణ మండపం అందరినీ ఆకట్టుకుంది. ఈ ఏర్పాట్లపై ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, కార్యనిర్వహణాధికారిని భక్తులు అభినందించారు.ఈ వివరాలను కార్యనిర్వహణాధికారి/సహాయ కమిషనర్ రామల సునీత తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ సుకినే సంతాజీ





**ఎల్కతుర్తి ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఊతమిస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏఎంసి చైర్మన్ సుకినే సంతాజి బుధవారం పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దామెర చింతలపల్లి భావుపేట్ తిమ్మాపూర్ కేశవపూర్ దండేపల్లి సూరారం కోతులనడుమ ఎల్కతుర్తి గ్రామాలలో ప్రభుత్వ అధికారులతో కలిసి కేంద్రాలను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు ప్రాథమిక వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అకాల వర్షాల సమయం కావున ధాన్యం తడవకుండా తా ర్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా గన్ని సంచులు నిల్వ ఉంచి రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ఇబ్బంది పడకుండా వ్యవస్థను అమలు చేస్తూ క్రమబద్ధంగా కొనుగోళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇక కేంద్రాల్లో తూకం యంత్రాలుతో పారదర్శకంగా తూకం వేయిస్తున్నామని తెలిపారు. ధాన్యం నాణ్యత తనిఖీ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి రైతులకు సరైన ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు ఆలస్యం కాకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. రవాణా సౌకర్యం కోసం ట్రాక్టర్లు లారీలు ఏర్పాటు చేసి దాన్యం తరలింపును వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతులు ఈ కేంద్రాలను వినియోగించుకుని ప్రభుత్వ మద్దతు ధరకు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని చైర్మన్ సంతాజీ సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, ఏ డి ఏ డి. ఆదిరెడ్డి, ఏఈఓ రాజ్ కుమార్, ఏవో పున్నం చందర్, తిరుపతి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఏపి ఎం పి. కవిత, మార్కెట్ డైరెక్టర్లు గౌడిశాల రాజయ్య గౌడ్, బండి సుధాకర్ గౌడ్, బచ్చు బాబురావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు టీపీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు మునిగడప లావణ్య శేషగిరి, మంకని పద్మ చీరాలు, బొంకూరి రజిత, అంబాల రాజ్ కుమార్, బత్తిని రవీందర్ గౌడ్, ముప్పు మానస మహేందర్, శ్రీకాంత్ రెడ్డి, భాషబోయిన లీల కొమురయ్య, మాట్ల లింగయ్య, గోలిపెల్లి సంపత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, హింగే శ్రీకాంత్, హుస్నాబాద్ అసెంబ్లీ మాజీ జనరల్ సెక్రెటరీ మండ సుమన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఈర భీమ్ రాజ్ వివిధ గ్రామాల వార్డు సభ్యులు కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధరిత్రి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22, (ప్రజాజ్యోతి) :** భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు.బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా రూపొందించిన "ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ (ఏప్రిల్ 15--30)" పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాతావరణ, భూ కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పనిలో పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని సూచించారు. పక్షం రోజుల పాటు నిర్వహిస్తున్న మదర్ ఎర్త్ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు మొక్కల నాటకం చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే ఏక వినియోగ ప్లాస్టిక్‌ను నివారించడం, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, పర్యావరణహిత కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ ర్యాలీలు, ఉదయ నడకలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వెంకట గిరిరాజ్ గౌడ్, డిపిఆర్‌ఓ ఆయూబ్ అలీ, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మరియు ఎన్‌జీసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస స్వామి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫలితాలు దారుణం..

- రాష్ట్రంలోనే కనిష్ట ఉత్తీర్ణత శాతం నమోదు
- ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్ జారీ




**పర్వతగిరి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్/జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలు తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయి. సెకండియర్‌లో 79 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 16 మంది మాత్రమే ఉత్తీర్ణులు అయ్యారు. ఫస్ట్ ఇయర్‌లో 68 మంది పరీక్షలకు హాజరుకాగా, 11 మంది మాత్రమే పాస్ కావడం గమనార్హం. ఈ ఫలితాలతో రాష్ట్రంలోనే అతి తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదు చేసిన కళాశాలగా ఈ మోడల్ స్కూల్ నిలిచింది. దీనిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విద్యార్థుల ఫలితాలు పాఠశాల నిర్వహణ లోపాలను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు.పాఠశాల నిర్వహణ, బోధన ప్రమాణాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి, ఏప్రిల్ 22,ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలయాపల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు అయిన గాజు సోమయ్య , గజావెల్లి మల్లికాంబ, గూడూరు బాలరాజు ఇటీవల వివిధ కారణాలతో మరణించగా, ఈ రోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కో కుటుంబనికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ లను పంపిణి చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, దేవరుప్పుల మండల పార్టీ నాయకులు ఏలే సుందర్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, బొమ్మినేని సురేందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, స్థానిక నాయకులు అయిన గ్రామ పార్టీ అధ్యక్షులు దోకుడు దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ గుడి యుగేందర్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు మైబు రెడ్డి, వశపాక మారయ్య, చిన్న యాకయ్య, గట్టు, గజావెల్లి రాజు, వశపాక విజయ్,తదితరులు పాల్గొన్నారూ.

## పరకాలలో ఖర్గే దిష్టిబొమ్మ దహనం



**పరకాల, ఏప్రిల్ 22, (ప్రజాజ్యోతి) :** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై "టెర్రరిస్ట్" అని అనుచితంగా మరియు అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఆదేశాలనుసారం బుధవారం బిజెపి పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పరకాల కూరగాయల మార్కెట్ సర్కిల్ వద్ద ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి మేఘనాథ్, పరకాల 12,15వ వార్డ్ కౌన్సిలర్స్ కుక్కల విజయ్, ఆకుల లావణ్య శ్రీధర్,పరకాల రూరల్ మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, పరకాల పట్టణ,మండల ప్రధాన కార్యదర్శులు సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి,గుండె బోయిన నర్సయ్య, జంగిలి రాజేందర్ రావు బిజెపి నాయకులు మారేడు కొండ భాస్కరాచారి ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, మెంతుల సురేష్, దంచనాధుల కిరణ్, కానుగుల గోపీనాథ్,చెంతన్ రెడ్డి, ముత్యాల దేవేందర్, కుంట మల్ల గణేష్, దామ సతీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుట్రల కమిషన్‌పై హైకోర్టు తీర్పు చెంపపెట్టు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22, (ప్రజాజ్యోతి) :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన కమిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు కక్షపూరిత రాజకీయాలకు చెంపపెట్టుగా నిలిచిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం భాస్కర్ అన్నారు.ఈ సందర్భంగా హనుమకొండ చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులతో కలిసి బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు నిర్వహించారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చే లక్ష్యంతో ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని భాస్కర్ గుర్తుచేశారు. అయితే రాజకీయంగా బదనాం చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా కమిషన్‌ను నియమించిందన్నారు. హైకోర్టు తీర్పుతో ఆ కుట్రలు పటాపంచలు అయ్యాయని, కాంగ్రెస్ కక్షపూరిత ధోరణికి ఇది గట్టి సమాధానమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన కమిషన్ పూర్తిగా నిరర్థకమని కోర్టు తీర్పు స్పష్టం చేసిందని, ఈ నిర్ణయం ఆనందదాయకమని తెలిపారు.

## హిందూ ధర్మ సమ్మేళనం విజయవంతం చేద్దాం

హిందువుల ఐక్యతే జాతీయ సమైక్యత



**పరకాల, ఏప్రిల్ 22, (ప్రజా జ్యోతి):** పరకాల పట్టణంలో ఈనెల 28వ శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో (పశువుల సంత) నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి ఉపాధ్యక్షుడు మాడుగుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి హాజరుకావాలని గందే వెంకటేశ్వర్లు మాజీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ హిందూ సమ్మేళనం శాలువాతో సత్కరించి కరపత్రమును అందజేస్తూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచడం ద్వారా దేశాన్ని తిరిగి విశ్వగురువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవాలంటే హిందువుల ఐక్యత అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఈ మహత్తర కార్యక్రమంలో హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

- ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల ను రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి వెంటనే పరిష్కరించాలి.
- మంత్రి పొన్నం వెంటనే కార్మికులతో చర్చలు జరపాలి



**భూపాలపల్లి టౌన్, ప్రజాజ్యోతి, ఏప్రిల్ 22 :** భూపాలపల్లి ఆర్టీసీ డిపో ముందు జరుగుతున్న నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పాల్గొని ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, కార్మికుల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని అన్నారు. ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటం న్యాయసమ్మతమని ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చర్చలు ప్రారంభించాలని కోరారు.

## మర్రిగూడ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ సంబరాలు

మర్రిగూడ,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి ):
మర్రిగూడ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన పోషక విలువల గురించి వివరించడం జరిగింది. మనకు స్థానికంగా దొరికే ఆకుకూరలు,మునగా,



బొప్పాయి, సీజనల లో దొరికే పండ్లు, కూరగాయలు,సిరి ధాన్యాలు తప్పకుండా తీసుకోవాలని, పిల్లలతో ఎక్కువగా మాట్లాడితే మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసులో ఆటలు,పాటలు,కథలు,సంభాషణ ద్వారా పిల్లల మెదడు అభివృద్ధి జరుగుతుంది. ఈ వయసులో పిల్లలకు ఆటపాటలతో విద్యను అందించాల్సిన అవసరం చాలా ఉంది కాబట్టి అంగన్వాడి స్కూళ్లలో నేర్చుకునే అవకాశం కల్పించడం ద్వారా వాళ్ల అభివృద్ధి మైలురాళ్లను చేరుకుంటారని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేశ్వరం రమేష్ , పంచాయతీ సెక్రటరీ యూసఫ్, అంగన్వాడి సూపర్వైజర్ యశోద,ఏ.ఎన్.ఎం శ్రీలక్ష్మి, అంగన్వాడి టీచర్లు రమాదేవి, విమలాదేవి,లక్ష్మి, శారద, అండాలు, ఆశా వర్కర్లు తల్లులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

ప్రభుత్వం యువత కు అన్ని విధాలుగా అండగా ఉంటుంది
సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి,రూరల్ ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):
భువనగిరి,మండలం బిఎన్ తిమ్మాపురం,గ్రామానికి చెందిన రావుల నాగరాజు రావుల,రాజశేఖర్ ల బేబీ కిడ్స్ స్టూడియోను బిఎన్






తిమ్మాపురం,గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉద్యోగాల,కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి వైపు,అడుగులు వేసి మంచి భవిష్యత్ ను నిర్మించు కోవాలని కోరారు.రావుల నాగరాజు –రాజశేఖర్ స్వయం ఉపాధి ని ఎంచుకొని వేరొకరి వద్ద ఉద్యోగం చేయకుండా తమకు నచ్చిన పనిని ఎంచుకొని,తమ నైపుణ్యంతో సొంతంగా వ్యాపారం చేసి ఆదాయం పొందాలని ఆలోచించి,ఈ బేబీ కిడ్స్ స్టూడియోను పెట్టడం అభినం దనీయమని అన్నారు.ప్రతి ఒక్క యువత చెడు వ్యస నాలకు,గురి కాకుండా సన్మార్గంలో పయనించి ఉద్యోగం లేదని నిరుత్సాహ పడకుండా స్వయం ఉపాధిని ఎంచుకొని భవిష్యత్ ను బంగారు మయం చేసుకోవా లని కోరారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా యూత్ ఐకాన్ ఎండీ,సమి భాయ్,మోర రాంరెడ్డి,డొంకెన అశోక్ గౌడ్ వళ్ళందాస్ పరమేష్ నకిరేకంటి నరేష్,రాంబాబు దశరథ కోరుపల్లి వెంకట్ రావుల,మహిపాల్,రావుల శ్రీను నకిరేకంటి పాండు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం చిన్నారి భవితకు వరం

మర్రిగూడ,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి ):
పోషకాహారం చిన్నారి భవితకు వరంలాంటిదని సూపర్వైజర్ వైష్ణవి అన్నారు.పోషణ పాక్వాడ లో భాగంగా బుధవారం మర్రిగూడ మండలం శివన్నగూడ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన పోషక విలువల గురించి సూపర్వైజర్ వైష్ణవి వివరించారు. పరిసరాలలో దొరికే ఆకుకూరలు మునగ ,బొప్పాయి, సీజనల్ పండ్లు చిరుధాన్యాలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివన్నగూడ సర్పంచ్ రాపోలు యాదగిరి పాల్గొని పిల్లలతో ఎక్కువగా మాట్లాడితే మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని వివరించారు. ఈ వయసులో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ విజయశ్రీ ,సువర్ణ బాలామృతం పిల్లలకు తినిపించాలని ఆ పిండితో రకరకాల వంటలు చేసి అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లో ఉన్న అంగన్వాడీ టీచర్స్ పాల్గొని విజయవంతం చేశారు.



## ఐకేపి వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

చివరి గింజ వరకు వడ్లను కొనుగోలు చేస్తాం: మార్కెట్ చైర్మన్ రేఖ బాబు రావు

భువనగిరి,రూరల్ ఏప్రిల్ 22, (ప్రజాజ్యోతి)
భువనగిరి మార్కెట్ కమిటీ పరిధిలోని బొమ్మాయిపల్లి, పెంచిక



ల్పహాడ్, బాలంపల్లి గ్రామాల్లో ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాలను,మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖ బాబురావు గారు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అనుకూలంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రతి రైతుకు న్యాయంగా, పారదర్శకంగా వడ్ల కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర అందించడమే కాకుండా, మధ్యవర్తి, దళారుల వ్యవస్థను తొలగించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూస్తామని,త్వరితగతిన రైతుల అకౌంట్లో డబ్బు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. బస్వాపురం కెనాల్ ద్వారా నీరు అందించి ఎండిపోయే స్థితిలో ఉన్న పొలాలను పంట చేతికి వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారని రైతులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ ఎండి,ఆవేస్,భువనగిరిమున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్,వైస్ చైర్మన్,పోతంశెట్టి మంజుల వెంకటే శ్వర్లు,వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి, పెంచికల్ పహాడ్ గ్రామ సర్పంచ్ పన్నాల మల్లికార్జున్ రెడ్డి,బాలంపల్లి సర్పంచ్ కాశపాక శ్రీరామ్,ఉప సర్పంచ్ సురుపంగ చందు, సిలివేరు నర్సింగ్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాడూరి నరసింహ,రంగా కృష్ణమూర్తి, ఏడుమేకల మహేష్ యాదవ్ చిలకూరి వెంకట్ రెడ్డి బద్దం లేచి రెడ్డి మొగిలి నర్సీ రెడ్డి దాసరి మారయ్య పార్వతి అశోక్,పార్వతి చంద్రయ్య జిట్టా,వేణు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.†

## మోటకొండూరులో బడిబాట

ఆలేరు ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలల బడిబాట కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి భూమండ్ల జయమ్మ శ్రీనివాస్ ,మండల విద్యాధికారి శ్రీ కేతిరెడ్డి రఘురాం రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఊరు ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచేత డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్ నిర్వహణ ద్వారా నాణ్యమైన బోధన మన పాఠశాలల్లో జరుగుతుందని అన్నారు.తద్వారా పదవతరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో మోటకొండూరు అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.మన గ్రామ విద్యార్థులు మన ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఉన్నత శిఖరాలకు చేరాలని పేర్కొన్నారు.తల్లదండ్రులు కూడా పాఠశాలల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వంగాల నిఖిత మహేందర్ గౌడ్, మరియు వార్డు సభ్యులు జూకంటి మధు,బుగ్గ నాగరాజు,ఆలేటి నాగరాజు, మరియు ఉపాధ్యాయులు కే రాజగోపాల్,ఎన్ సుధారాణి,సిహెచ్ శ్రావణ్




కుమార్,ఎన్ మల్లేశం,కే రమేష్,బి శ్రీలత ,రమాదేవి,గిరిజ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వైష్ణవి కార్పొరేట్ జూనియర్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత డిప్లొమా,కోర్సుల అవగాహన సదస్సు

భువనగిరి,ఏప్రిల్ 22ప్ర(జాజ్యోతి)
పదవ తరగతి పూర్తి,చేసిన విద్యార్థులు తమ భవిష్యత్ విద్యా మార్గాన్ని సరిగ్గా,ఎంచుకునేందుకు ఉపయోగపడే విధంగా,బి డి ఎఫ్ మరియు,మైత్రి అకాడమీ,నల్గొండ వారి ఆధ్వర్యంలో,యాదాద్రి భువనగిరి,ట్రస్మా సహకారంతో ఉచిత అవగాహన సదస్సు,నిర్వహించ బడుతోందని శ్రీ వైష్ణవి కార్పొరేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధిర మల్లేశం తెలిపారు.ఈ సదస్సులో సీఐ,టీడీ,సి, ఐ,పి,ఈటి మరియు పాలిటెక్నిక్ కోర్సులపై స్పష్టమైన అవగాహన కల్పించనున్నారు.కోర్సుల వివరాలు వాటి ప్రాము ఖ్యత,భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా నిపుణులు వివరించనున్నారని తెలిపారు.అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఉచిత (ఫ్రీ మోక్ టెస్ట్ ) పాలిటెక్నిక్ మాక్ టెస్ట్ నిర్వహించనున్నారు.పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులుఅందజేస్తామని తెలిపారు.మొదటి బహుమతి ₹2500, రెండవ బహుమతి ₹1500, మూడవ బహుమతి ₹1000 గా ప్రకటించారు. ఈ అర్హత పరీక్ష ఈ నెల ఏప్రిల్ 26,న ఉదయం10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, భువనగిరిలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల లో జరగనుందని అన్నారు.ఈ సందర్భంగా మైత్రి అకాడమీ చైర్మన్ పాముల అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ"పదవ తరగతి తర్వాత చాలా మంది విద్యార్థులు ఏ కోర్సు తీసుకోవాలనే,సందిగ్ధంలో ఉంటారు. అలాంటి సమయంలో సరైన మార్గదర్శకత్వం ఎంతో అవసరమని అన్నారు.ఈ ఉచిత సదస్సు ద్వారా విద్యార్థులు,స్పష్టమైన దిశను పొందుతారని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు.ఈ సదస్సుకు హాజరుకావాలనుకునే విద్యార్థులు,తల్లిదండ్రులు 93939494 97,73 82 17 91 27 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.



## ప్రచార ఆర్భాటాలు వద్దు.. ప్రజల కష్టాలు తీర్చండి

నన్ను విమర్శించే సమయం.. అభివృద్ధిపై కేటాయిస్తే మునుగోడు బాగుపడుతుంది

చౌటుప్పల్ ఫ్లైఓవర్ పనులపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూసుకుంట్ల హితవు

చౌటుప్పల్, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి):
మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తనపై చేసే వ్యక్తిగత విమర్శలను పక్కన పెట్టి, నియోజకవర్గ వికాసంపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కంటే కేవలం సామాజిక మాధ్యమాల్లో 'రీల్స్' చేస్తూ ప్రచారానికే ఎమ్మెల్యే ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో మునుగోడులో సాగు, తాగునీటి ప్రాజెక్టులతో పాటు వంద పడకల ఆసుపత్రిని నిర్మించి ఎంతో అభివృద్ధి చేశామని కూసుకుంట్ల గుర్తుచేశారు. ఫ్లోరోసిస్ పీడను శాశ్వతంగా తరిమికొట్టామన్నారు. అయితే గత ఏడాది కాలంగా చౌటుప్పల్ ఫ్లైఓవర్ పనులను పట్టించుకున్న నాథుడే లేరని, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. తాము చేసిన పోరాటం వల్లే అధికారులు అండర్‌పాస్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే అసెంబ్లీలో నోరు మెదపడం లేదని నిలదీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం కోతలతో రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. "రాజకీయ సవాళ్లు మానేసి అభివృద్ధిపై చర్చకు రా.. దమ్ముంటే రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం" అని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. నియోజకవర్గ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దది బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, గిర్కటి నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు




## జేమ్లా నాయక్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు: ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, ఏప్రిల్ 22,(ప్రజాజ్యోతి):
దేవరకొండ మండలం సూర్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని మాన్య బావోజి తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త నేనావత్ జేమ్లా నాయక్ మృతి పట్ల ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతుడి సమాచారం తెలుసుకున్న ఆయన బుధవారం స్వగ్రామానికి చేరుకుని జేమ్లా నాయక్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జేమ్లా నాయక్ మరణం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూర్య తండా సర్పంచ్ నేనావత్ కవిత–లచ్చిరాం, ఉపసర్పంచ్ కొర్ర రవీందర్, మాజీ సర్పంచ్ నేనావత్ నారాయణ, వార్డు సభ్యులు దాస్య, జైపాల్, రాము, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పుపై వేముల వీరేశం స్పందన.. కాళేశ్వరం పై సీబీఐ విచారణ డిమాండ్

నకిరేకల్, ఏప్రిల్ 22:
ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హైకోర్టు తీర్పుపై స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ–బీఆర్ఎస్ మధ్య ఉన్న ఒప్పందం కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరగడం లేదని ఆయన ఆరోపించారు. సీబీఐ ఎందుకు రంగంలోకి దిగడం లేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరపాలని బీజేపీ మంత్రులను వీరేశం కోరారు. హైకోర్టు



తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే ఆ తీర్పును చూసి బీఆర్ఎస్ నేతలు అనవసరంగా హర్షం వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాల కారణంగా పిల్లర్లు కూలిపోయిన అంశం నిజమని పేర్కొంటూ, ఈ ప్రాజెక్టు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తన భాషను మార్చుకోవాలని, అహంకారం తగ్గించుకోవాలని వీరేశం సూచించారు. సూర్యాపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు నుంచి కూడా బీఆర్ఎస్ నేతలు పాఠాలు నేర్చుకోవడం లేదని విమర్శించారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు

మర్రిగూడ, ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి ):
ప్రభుత్వం ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు.మంగళవారం గట్టుపల్ మండల కేంద్రంలో ఇంటి ఇంటికి సిపిఐ అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా



పలువురిని కలుస్తూ విరాళాలు సేకరించారు. అకాల వర్షాలు వడగండ్ల వానల కారణంగా ధాన్యం తడిసి రైతాంగం ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులు గత నెల రోజులుగా ధాన్యాన్ని పోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న అధికారులు ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ విభజన రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. డిలిమిటేషన్ పేరుతో అసెంబ్లీ పార్లమెంటు స్థానాల పెంపు ఆమోదయోగంగా లేనందుని పార్లమెంటులో బిల్లులు వీగిపోయాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, రైతు సంఘం జిల్లా కోశాధికారి కంపే దుర్గయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్,కందాల ముత్యం, శాఖ కార్యదర్శి కారింగ్ శీను,నాయకులు రాపోలు సత్తయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీడ్కోలు సమావేశం: ముఖ్య అతిధిగా హాజరైన ప్రిన్సిపాల్ అండాలు

భువనగిరి,రూరల్ ఏప్రిల్ 22, ప్రజాజ్యోతి:
యాదాద్రి,భువనగిరి జిల్లా,పరిషత్ ఉన్నత పాఠశాల రాయగిరిలో,పదవ తరగతి విద్యార్థుల,వీడుకోలు సమావేశాన్ని,9వ తరగతి విద్యార్థులు ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు పాఠశాలతో, ఉన్న అనుబంధాన్ని గుర్తు,చేసుకుంటూ భావోద్వేగంగా మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు అండాలు మాట్లాడుతూ విద్యార్థులు,తమ భవిష్యత్తులో ఉన్నత,



స్థాయికి చేరుకోవాలని ఆ కాంక్షించారు. పాఠశాల దశలో నేర్చుకున్న క్రమ శిక్షణ , విద్య జీవితంలో విజ య o సాధించడానికి ముఖ్య మ ని పేర్కొన్నారు.అలాగే అలాగే ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో అలవర్చుకున్న క్రమశిక్షణ,విలువలు వారి భవిష్యత్తును, ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు.ఈ కార్యక్రమం లో ఏపీసీ చైర్మన్ బొజ్జ భాగ్యమ్మ వార్డు,కౌన్సిలర్ అరుణ పూర్ణ చందర్, కాయితి హనుమంత్ రెడ్డి నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్‌లో ఆర్టీసీ సమ్మె సైరన్ డిపోకే పరిమితమైన బస్సులు




ప్రజాజ్యోతి బోధన్ ఏప్రిల్ 22.. నిజాంబాద్ జిల్లా బోధన్ ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృతం బస్సులు డిపోకే పరిమితం కావడంతో ప్రయాణికులు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు బోధనలో ఆర్టీసీ కార్మికుల.సమ్మె ఆర్టీసీ డిపోలో నిలిచిపోయిన బస్సులు ప్రైవేట్ బస్సుల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు నిజాంబాద్ జిల్లా బోధన్ ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా డిపోకే పరిమితమైన బస్సులు. అర్ధరాత్రి నుంచి బస్సులు నిలిచిపోయాయి. డ్రైవర్లు కండక్టర్లు బస్టాండ్ డిపో వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు ప్రయాణికుల సౌకర్యార్థం డిపో అధికారులు ప్రైవేటు బస్సులను నడుపుతున్నారు బాన్సువాడ పోతంగల్ నిజామాబాద్ రూట్ లలో ప్రైవేటు బస్సులు ప్రారంభించారు

## ఇందల్వాయి తండాలో ప్రజా బాట కార్యక్రమం

– విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సు




ఇందల్వాయి( ప్రజా జ్యోతి) ఏప్రిల్. 22 ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి తాండ గ్రామపంచాయతీ పరిధిలో ఈరోజు ప్రజా బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ ఈ కె ఎస్ ఆర్ మూర్తి. ఎస్బిఐ సందీప్ లైన్మెన్ అబ్దుల్ ఏ ఎల్ ఎన్ రవి హాజరయ్యారు గ్రామ సర్పంచ్ సుదర్శన్ నాయక్ ఉపసర్పంచ్ తో పాటు గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఈ మూర్తి మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్యలపై ప్రజల్లో అవగాహన చాలా అవసరమని ఆయన తెలిపారు. ఇప్పటికే అవగాహన లోపంతో కొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు జరిగాయని పేర్కొన్నారు. విద్యుత్ కు సంబంధించిన ఎలాంటి సమస్యలైనా వెంటనే అధికారులను సంప్రదించాలని ఆయన అన్నారు సంప్రదిస్తే ఐదు నిమిషాల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం సర్పంచ్ సుదర్శన్ నాయక్ మాట్లాడుతూ స్వయంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని. గ్రామంలో ఇలాంటి సమస్యలైనా అధికారుల దృష్టికి తీసుకెళ్తే తక్షణమే పరిష్కారం అందిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో విద్యుత్ భద్రతకు అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. సౌమ్య నాయక్ ఎక్స్ సర్పంచ్ చందర్ నాయక్. వీడిసి గోపాల్ నాయక్ ఉ ప గోపాల్ తాండ తదితరులు పాల్గొన్నారు.

### పదవి విరమణ కార్యక్రమానికి

## ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి





సిరికొండ (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 22 సిరికొండ మండలంగడ్కోల్ గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దువ్వూరి లక్ష్మారెడ్డి గారి పదవి విరమణ మహోత్సవానికి గ్రామంలో ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందుతున్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి తాహెర్బిన్ హందాన్ గారు మాట్లాడుతూ దువ్వూరి లక్ష్మారెడ్డి గారు నాకు ఆప్త మిత్రుడు అని ఆయన ఉపాధ్యాయ వృత్తిలో నైపుణ్యంతో విద్యార్థులను పై స్థాయికి తీసుకువచ్చారని ప్రభుత్వ ఉద్యోగంలో విరమణ సర్ సర్వసాధారణమని ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని ఆయన కోరారు పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ దువ్వూరి లక్ష్మారెడ్డి గారు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించడం చాలా సంతోషమని అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను 51% పి ఆర్ సి అమలు చేయాలని హెల్త్ కార్డులు ఇప్పించాలని 63 డిమాండ్స్ నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఈ కార్యక్రమంలో గడుకోల్ హెచ్‌ఎం శ్రీకాంత్ రెడ్డి ప్రైమరీ హెచ్‌ఎం చిలుక శ్రీనివాస్, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జి కిషన్ మండల అధ్యక్షులు మొజిరం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు విద్యార్థులు,, పాల్గొన్నారు


### కమ్మర్‌పల్లిలో శ్రీ లక్ష్మీ నరసింహ

## స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర

కమ్మర్‌పల్లి ( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న స్వామివారి కళ్యాణ మహోత్సవం, ప్రథమ జాతరను పురస్కరించుకుని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులడు సుభాష్ గౌడ్ గ్రామ ప్రజలకు సాదర ఆహ్వానం పలికారు. ఆలయ చరిత్రలోనే మొదటిసారిగా ఇంతటి భారీ జాతరను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ 30 గురువారంఉదయం 5:00 గంటలకు స్వామివారికి అత్యంత వైభవంగా పంచామృత అభిషేకం నిర్వహించ బడుతుందన్నారు. మధ్యాహ్నం లోక కళ్యాణార్థం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగుతుంది. ఈ పర్వదినం సందర్భంగా ఆలయ చరిత్రలో మొదటి సారి జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 26 నుండి మే 1వ తేదీ వరకు నిరంతరాయంగా వైశాఖ సేవలు కొనసాగుతాయని తెలిపారు. స్వామి వారి కళ్యాణ తంతులో కూర్చుని పూజలు నిర్వహించాలనుకునే దంపతులు లేదా జంటలు ముందస్తుగా కమిటీ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ పవిత్ర కార్యక్రమాలలో గ్రామ ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుభాష్ గౌడ్, ఉపాధ్యక్షులు సింగిరెడ్డి భరత్, క్యాషియర్ పన్నాల రవీందర్ మరియు కమిటీ సభ్యులు కోరారు.

## అర్ధరాత్రి దొంగల బీభత్సం

గంగారం తండా జిపి పరిధిలో



ఇందల్వాయి( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 22 ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారాం తండా గ్రామానికి చెందిన నసీం సుల్తానా తేదీ 21 4 2026 నాడు ఉదయం 10 గంటలకు తన కూతురు యొక్క కుమారుడు ఆరోగ్యం బాగా లేనందున నిజామాబాద్ హాస్పిటల్కు వెళ్ళింది తేదీ 21/22-04-2026 అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి, బెడ్‌రూమ్ అల్మిరా పగలగొట్టి అందులో గల 5 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు 20 వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లినట్టు సుల్తానా చెప్పిన ఆధారల ప్రకారం దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇందల్వాయి ఎస్సై సందీప్ తెలిపారు.



# ప్రాణమున్నంత వరకు కేసీఆర్ వెంటే

- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి
- బీఆర్ఎస్‌ను వీడను, బీజేపీలో చేరను
- నేను పార్టీ మారుతున్నానన్నవార్తలు నిరాధారం
- తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీ కుట్రలో భాగమే నాపై దుష్ప్రచారం




ప్రజా జ్యోతి : ఆర్మూర్, ఏప్రిల్22: తాను బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి బీజేపీలోకి మారుతున్నానని కొన్ని వార్తా సంస్థల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తాను జీవితంలో ఎప్పుడూ బిఆర్ఎస్ ను వీడను, బీజేపీతో సహా మరే పార్టీలో చేరను అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయంగా తనను ఎదుర్కొనే దమ్ము లేను కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒక పథకం ప్రకారం సాగిస్తున్న కుట్రలో భాగమే తనపై ఈ దుష్ప్రచారం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కంఠంలో ప్రాణమున్నంత వరకూ కేసీఆర్ బాట వీడనని, చివరి వరకు గులాబీ నీడలోనే రాజకీయాలు చేస్తానని ఆయన అన్నారు. తాను రాజకీయ ఓనమాలు దిద్దుకున్న పార్టీ బీఆర్ఎస్ అని, తన రాజకీయ గురువు, ఆరాధ్య దైవం కేసీఆర్ అని జీవన్ రెడ్డి తెలిపారు. తాను బీజేపీలో చేరడానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ఢిల్లీలో కలిసినట్టు కట్టుకథలు ప్రచారం చేసురున్నారని ఆయన మండిపడ్డారు. నిజానికి తాను ఏ కేంద్ర మంత్రిని కలవలేదని, తాను హైదరాబాద్ లోనే ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి పేక్ ప్రచారాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

## దోమకొండ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

– విద్యార్థినులతో మమేకమై ఆశయాలు తెలుసుకున్న కలెక్టర్





కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 22. (ప్రజాజ్యోతి) కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం దోమకొండ మండలంలోని బాలికల రెసిడెన్షియల్ వసతిగృహాన్ని సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులతో మమేకమై, ఒక్కొక్కరితో మాట్లాడి వారి ఆశయాలు, లక్ష్యాలను తెలుసుకున్నారు. “మీరంతా భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయికి ఎదగాలి. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి” అని విద్యార్థినులకు సూచించారు.వసతిగృహంలో మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అందిస్తున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులన్నీ విద్యార్థినులకు సక్రమంగా అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ ని ఆదేశించారు.హాస్టల్‌కు రావడానికి సి.సి. రోడ్డు మంజూరైనప్పటికీ వీధి దీపాలు లేవని ఎంపీడీవో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్, సంబంధిత జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్, ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి విద్యుత్ శాఖ సహకారంతో వైరు గుంజి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పనులను గ్రామ పంచాయతీ నిధులు మరియు జిల్లా కలెక్టర్ నిధులతో వెంటనే పూర్తి చేయాలని సర్పంచ్ కి సూచించారు.అదేవిధంగా కాంపౌండ్ వాల్ పడిపోయిన విషయాన్ని గమనించి, దాని మరమ్మత్తు పనులపై జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారితో మాట్లాడి, కాంపౌండ్ వాల్ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ తిరుమల గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ శివరాములు, ప్రత్యేక అధికారిణి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సుధాకర్, ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఓ రవికుమార్, ప్రిన్సిపాల్ చైతన్య సుధ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

### రాజంపేట మండలంలో

## 108 అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ



రాజంపేట ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) రాజంపేట మండల పరిధిలో 108 అంబులెన్సులను అత్యవసర వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచే ఉద్దేశంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్వాలిటీ అధికారి ఎస్కే ఫయాజ్ అంబులెన్సుల పరిస్థితి, శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల్లో ఉన్న వైద్య పరికరాలు, మెడికల్ కిట్లు, ఆక్సిజన్ సిలిండర్లు మరియు అత్యవసర మందుల లభ్యతను నిశితంగా పరిశీలించారు. అలాగే సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా సమయపాలన, యూనిఫాం ధరించడం, రికార్డుల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా మరియు నాణ్యమైన సేవలు అందించాలనే దిశగా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యక్రమ నిర్వాహకుడు జనార్ధన్, జిల్లా వైద్య అధికారి తిరుపతి, అంబులెన్స్ సిబ్బంది పైలెట్ ప్రశాంత్, వైద్య సిబ్బంది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ వినియోగదారుల

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

– టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ ఎరుకల నారాయణ





నాగిరెడ్డిపేట్,ఏప్రిల్22(ప్రజాజ్యోతి); విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించి, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు.బుధవారం నాగిరెడ్డిపేట్ మండలంలోని బంజారా సబ్ స్టేషన్ లో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిస్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు గ్రామాల్లో లూస్ పోల్,లైన్ షిఫ్టింగ్ సమస్య నెలకొందని దాంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తమ దృష్టికి తీసుకువచ్చారని,వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిస్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని,సర్పంచులు డి ఈ , ఏ ఈ , ఏ డీ ల తో సమన్వయం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో విధి నిర్వహణలో గాయాలలకు సంబంధించి రెండు పిర్యాదులు వచ్చాయని,సరైన పత్రాలు సమర్పించాక అవి పెండింగ్ లో ఉన్నట్లు ఎల్లారెడ్డి డిఈ తమదృష్టికి తీసుకువచ్చారని, తక్షణమే సరైన పత్రాలు సమర్పిస్తే ఈ నెలాఖరు వరకు వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. సమస్యలను నిర్దేశించిన సమయంలో పరిష్కరించకపోతే తగిన ఆధారాలతో వినియోగదారుల ఫోరం దృష్టికి తెలపాలని,అధికారులపై చర్యలు తీసుకుంటామని సూచించారు. అలాగే రెవెన్యూ కలెక్షన్‌లను ఎప్పటికప్పుడు మెరుగుపర్చాలని,రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్‌లు బిగించుకోవాలని సూచించారు.ఆగిపోయిన సర్వీసులను మూడు నెలల్లో బిల్లు వసూలు చేయాలని తెలిపారు. వినియోగదారుల సమస్యలపై నిర్వహించిన పరిష్కార వేదికలో వివిధ గ్రామాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలపై అర్జీలు అందించారని,మొత్తం 14 ఫిర్యాదులు అందించినట్లు తెలిపారు. ఏదైనా సమస్య వస్తే 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెంబర్ టెక్నికల్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ సత్యనారాయణ, ఇండిపెండెంట్ మెంబర్ రాజాగౌడ్, ఎల్లారెడ్డి డిఈ విజయ్ సారథి, ఏఈ నాగరాజు, ఆయాగ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### మినీ ట్యాంక్ వద్ద

## ప్రమాదకర పరిస్థితి

– వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్





బాన్సువాడ ఆర్‌సి, ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి) బీర్కూరు మండలంలోని బరంగి ఏడిగి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఉన్న మినీ వాటర్ ట్యాంక్ వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ట్యాంక్ చుట్టూ నాచు పేరుకుపోవడంతో జారి పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా చిన్నపిల్లలు నీళ్లు తీసుకునేందుకు ట్యాంక్ వద్దకు వెళ్లే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. ఒకవేళ కాలు జారి పడితే తీవ్ర గాయాలు అయ్యే ప్రమాదం ఉండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇలాంటి సమస్యపై గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల భాగంగా ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాలు గ్రామంలో కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ ట్యాంక్ పరిసరాలను శుభ్రపరచడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రత చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదాలు జరుగకముందే సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మృత్యు మలుపునకు రక్షణ కవచం!

– 'ప్రజాజ్యోతి' వార్తకు స్పందన – వేగ నియంత్రికకు మలుపు వద్ద 'రంబుల్ స్ట్రిప్స్' ఏర్పాటు






ప్రజాజ్యోతి
09 Mar 2026 - Page 8
జాతీయ రహదారిపై.. 'మృత్యు' మలుపు!
– 'రంబుల్ స్ట్రిప్స్' వేయాలని ప్రయాణికులు డిమాండ్

**నర్సాపూర్, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి)** జాతీయ రహదారి 765డీ పై చిన్న చింతకుంట జంక్షన్ వద్ద పొంచి ఉన్న ప్రమాదాలపై 'ప్రజాజ్యోతి' ప్రచురించిన కథనం ఫలించింది. మార్చి 9వ తేదీన "జాతీయ రహదారిపై.. మృత్యు మలుపు!" అనే శీర్షికతో వెలువడిన కథనానికి జాతీయ రహదారి అధికారులు సానుకూలంగా స్పందించారు. ప్రమాదాలకు నిలయంగా మారిన ఆ ప్రమాదకర మలుపు వద్ద 'రంబుల్ స్ట్రిప్స్' ఏర్పాటు చేసి వేగ నియంత్రణకు చర్యలు చేపట్టారు.

**ప్రాతిపదికన చర్యలు..**

ఈ మార్గంలో ఊరి లోపలికి వెళ్లే ప్రధాన రహదారి, జాతీయ రహదారి కలిసే చోట ఎటువంటి వేగ నియంత్రణ చర్యలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని 'ప్రజాజ్యోతి' ఆధారాలతో సహా ఎత్తిచూపింది. ఈ వార్తతో ఎన్‌హెచ్ అధికారులు స్పందించి, మలుపు వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేలా రంబుల్ స్ట్రిప్స్‌ను నిర్మించారు. ఫలితంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడే ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు పెద్ద ఊరట లభించింది.

**కృతజ్ఞతల వెల్లువా..**

ప్రమాద నివారణకు చర్యలు చేపట్టిన అధికారులకు మరియు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ప్రజాజ్యోతి' దినపత్రికకు చిన్న చింతకుంట గ్రామస్థులు, ప్రయాణికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ గోడును వినిపించి, మృత్యు మలుపు వద్ద రక్షణ కల్పించినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

## హైవేపై 'ముంజల' జోరు..

# ప్రయాణికులకు చలువ విందు!

– వేసవి తాపానికి ప్రకృతి ప్రసాదించిన అమృతం 'తాటి ముంజలు'



**నర్సాపూర్, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి)** భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం అల్లాడిపోతుంటే, ప్రకృతి మాత్రం తన ఒడిలో దాచుకున్న చలువ ముంజలను పంచుతోంది. మెదక్--హైదరాబాద్ జాతీయ రహదారి 765డి పై తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకోలేక అల్లాడుతున్న ప్రయాణికులు, ఈ రహదారి వెంట విక్రయిస్తున్న తాటి ముంజలను కొనుగోలు చేస్తూ కాస్త సేదదీరుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి మెదక్ వైపు ప్రయాణించే పర్యాటకులు ఈ ప్రకృతి సిద్ధమైన 'ఐస్ ఫ్రూట్స్'ను ఆస్వాదిస్తూ దాహార్తిని తీర్చుకుంటున్నారు.

**ఆరోగ్యానికి 'ముంజ' రక్షణ..**

కృత్రిమ పానీయాల కంటే ప్రకృతి సిద్ధంగా లభించే తాటి ముంజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ముంజలలో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన తేమను అందించి, ఎండదెబ్బ తగలకుండా కాపాడతాయి. వీటిలో విటమిన్ బి, పొటాషియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ సీజన్‌లో తాటి ముంజల విక్రయాల ద్వారా కార్మిక కుటుంబాలకు చేతినిండా ఉపాధి లభిస్తోంది. రసాయనాలు కలిసిన శీతల పానీయాల కంటే, తక్కువ ధరలో లభించే ఈ అమృతాన్ని తీసుకోవడమే ఉత్తమమని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

# నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం

– రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచ్ దయాకర్ గౌడ్





**కొల్చారం (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 22** :గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని గ్రామపంచా యతీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి ఎంపీ,ఎమ్మెల్యే సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని గ్రామ సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్ తెలిపారు. పోతంశెట్టి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గ్రామ సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పులబోయిన నర్సమ్మ, స్వామి సర్పంచును , పాలకవర్గం,మరియు గ్రామ పెద్దలను శాలువాలతో సత్కరించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, ఉప సర్పంచ్ గుండు నాని, మాజీ సర్పంచ్ గడ్డమీది నర్సింలు ,సెక్రటరీ అరుంధతి, హౌసింగ్ ఏఈ సుష్మా,టి ఏ సుదర్శన్, వార్డు మెంబర్లు నాయికోటి మహిపాల్, చాకలి అశోక్,చిట్యాల రవి, జలగం సంతోష్, బుట్ట శ్రీనివాస్, సగినాల రాకేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల వినియోగంపై అవగాహన

– వ్యవసాయ యంత్ర పరికరాలకు పూజా కార్యక్రమం
– హాజరైన పలువురు శాస్త్రవేత్తలు






**చిన్నకోడూరు, ఎప్రిల్22,(ప్రజా జ్యోతి):-** సేంద్రీయ ఎరువులను వినియోగించడం ద్వారా పర్యావరణానికి హాని తగ్గడంతో పాటు పంటల నాణ్యత కూడా మెరుగుపడుతుందని నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సతీష్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సమతుల్య ఎరువుల వినియోగం పై రైతులకు శిక్షణ అందించారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులను వాడటం వలన నేలసారాన్ని సంరక్షించటమే కాకుండా పెట్టుబడిని తగ్గించుకోవచ్చని తెలిపారు.అంతకు ముందు ఐసీఐసీఐ వారి సహకారంతో ఐసీఏఆర్ భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఎఫ్పీఓకు అందించిన వ్యవసాయ యంత్ర పరికరాలకు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.ఆర్.డి.ప్రసాద్, డా.సురేష్, డా.ఖురేషి,సంఘ చైర్మన్ ఏలేటి వెంకటరెడ్డి, అధికారులు నిహారిక, సీఈఓ మట్ట మల్లారెడ్డి, అకౌంటెంట్ కృష్ణ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నడిరోడ్డులో ఇల్లు..

# నరకంగా మారిన గ్రామ రాకపోకలు..

– 30 గజాల ఆక్రమణతో పంచాయతీ అనుమతులు లేకుండా భారీ నిర్మాణం!









**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 22:** వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామంలో జరిగిన అక్రమ నిర్మాణం ఇప్పుడు పెద్ద వివాదానికి దారి తీసింది. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడమే కాకుండా, పంచాయతీ సీసీ రోడ్డుపైనే కాంపౌండ్ వాల్ నిర్మించడం గ్రామ ప్రజల ఆగ్రహాన్ని రగిలిస్తోంది.భారీ బంగ్లా నిర్మాణం చట్టాలను పూర్తిగా ధిక్కరిస్తూ కొనసాగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చుట్టుపక్కల ప్రజల సౌకర్యాలు, భద్రతను పట్టించుకోకుండా నిర్మాణం చేయడం వల్ల రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కరెంటు వైర్లకు కూడా అడ్డంకిగా మారిన ఈ నిర్మాణం ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా, స్థానికుడు రఘువీర్ పంతులు సుమారు 30 గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ విషయంపై గ్రామపంచాయతీ అధికారులు ఐదుసార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, పంచాయతీ సెక్రెటరీ స్పందించకపోవడం అధికార వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. "నోటీసులు ఉన్నా చర్యలు లేవు. ఇది ఎవరి నిర్లక్ష్యం?అంటూ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత సెక్రెటరీపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.బాధితుడు రఘువీర్ పంతులు మళ్లీ ఫిర్యాదు చేయడంతో డీఎల్పీవో యాదయ్య బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఇంటి యజమాని ప్రతాప్ రెడ్డి, రామచంద్ర రెడ్డి పై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ,రోడ్డుపైనే ఇల్లు కడితే మేము ఎలా వెళ్లాలి?"ఇది గ్రామమా... లేక ఒక్కరి రాజ్యమా?" అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని...అక్రమ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆక్రమించిన స్థలాన్ని తిరిగి అప్పగించాలి.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.అని గ్రామస్థులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీసీ సమ్మె

– విధులు బహిష్కరించిన కార్మికులు
– డిపోలకే పరిమితమైన బస్సులు
– ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
– ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం







**మెదక్ ప్రతినిధి( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 22 :** ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టారు. ఆర్టీసీ జేఏసీ నేతలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మె అనివార్యమైంది.బుధవారం అర్ధరాత్రి నుంచి కార్మికులు విధులు బహిష్కరించడంతో ఎక్కడికక్కడ బస్సులు డిపోలకే పరిమితమయ్యా యి. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ ఆర్టీసీ డిపో వద్ద తెల్లవారుజామున జేఏసి నేతలతో కలిసి కార్మికులు పెద్ద ఎత్తున బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు భారీ బందోబస్తుతో మోహరించారు. మెదక్ ఆర్టీసీ డిపోలో పోలీసులకు, ఆర్టీసీ కార్మికుల మధ్య వాగ్వివాదం చోటుచేసు కుంది. బస్సులను డిపోల నుండి బయటకు వెళ్లనివ్వకుండా కార్మికులు అడ్డుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక నేతలు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న 30 శాతం ఫిట్మెంట్, నేతన బకాయిల చెల్లింపు చేయాలన్నారు. పీఎఫ్, సీసీఎస్ కు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.యూనియన్ల పునరుద్ధరణ చేయాలన్నా రు. తెలంగాణ ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి సమస్యలను పరిష్కరించా లని కోరుతూ పలుమార్లు వినతి పత్రాలను అందించినా స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణం స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాల న్నారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తా మని హెచ్చరించారు.

**కార్మికుల సమ్మెతో ప్రజా రవాణాకు అంతరాయం ఏర్పడింది.**

సమ్మె ప్రభావంతో బస్సులు నిలిచిపోవడం వలన ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపారులు, విద్యార్థులు రవాణా గాల్లో పనిచేసే ఉద్యోగులు, సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాగా ప్రయాణికు లకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పై దృష్టి సారించింది. అద్దె బస్సులను నడిపించడంతో పాటు తాత్కాలికంగా కండక్టర్ల నియామకానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయా డిపో మేనేజర్లు ప్రకటించారు.

## ఎఫ్‌సిఆర్ఐలో

# ఘనంగా ధరిత్రి దినోత్సవం







**ములుగు, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రమైన ములుగు అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం కళాశాల డీన్ ప్రవీణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని కళాశాల సమీపంలోని ప్రధాన రహదారి వెంబడి పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడంతోపాటు,పక్షుల దాహార్తిని తీర్చడానికి ఆయా ప్రదేశాలలో నీటి తట్లను ఏర్పాటు చేసి తొట్లలో నీటిని నింపారు.అనంతరం జవహర్ నగర్ లోని డంపింగ్ యార్డ్ ను సందర్శించి ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ గూర్చి నేర్చుకున్నారు.ఈ ఈ సందర్భంగా కళాశాల డీన్ ప్రవీణ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితులలో ప్లాస్టిక్ వినియోగం అధికం కావడం వల్ల పర్యావరణం కలుషితమవుతుందని,భవిష్యత్తులో మనుషుల మనుగడ సాధించాలంటే ధరిత్రిని రక్షించుకొంటూ పర్యావరణాన్ని పునరుద్ధరించుకుంటూ కాపాడుకోవడం ఒకటే మార్గం అని,ఈ కార్యక్రమాలను పరిరక్షించడంలో అటవీ కళాశాల విద్యార్థులు ముందుకు సాగడం హర్షనీయమన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనిధి, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి దృష్ట్యా

# భక్తులకు చలివేంద్రం ఏర్పాటు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు




**కొమురవెల్లి, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):-** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం దేవాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుకింగ్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి డి. కృష్ణ ప్రసాద్, సహాయ కార్యనిర్వహణాధికారులు బుద్ధి శ్రీనివాస్, రావుల సుదర్శన్, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్‌తో పాటు దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు ఎండ తీవ్రతలో ఉపశమనం కలిగేలా ఈ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## ప్రజా ప్రభుత్వంలో విద్యకు ప్రథమ ప్రాధాన్యం,
## ఎంజేపి గురుకుల పాఠశాలను సందర్శించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్

ఎండపల్లి/వెల్గటూర్, ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి: ప్రజా పాలనలో ప్రభుత్వ విద్యపై విద్యార్థుల తల్లి తండ్రులకు మరింత నమ్మకం పెరిగిందని తల్లిదండ్రుల ఆశయాలకు తగ్గట్లు కార్పొరేట్ స్థాయి విద్య.లభిస్తుంది అని,రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులతో విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో రోజురోజుకీ ప్రవేశాల సంఖ్య పెరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం, సాంకేతిక విద్యను అందించడానికి ముందస్తు



సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వ లక్ష్యంతో విద్యార్థులకు అందించే ఆహార విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని డైట్ అందిస్తున్నా మని మంత్రి తెలిపారు. అంతేకాకుండా కాస్మెటిక్ చార్జీలను పెంచి ఇవ్వడం జరుగు



తుందని తెలిపారు. చదువు ద్వారానే సమాజంలో మార్పులు వస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకు న్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందని ఇందుకు ఆన్లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులే నిదర్శనమని మంత్రి తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వంతుగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నేతలు నాయకులు ,గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు , తదితరులు ఉన్నారు,

# ఎస్సీ హాస్టల్‌లో ప్రత్యేక పారిశుధ్యం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి ) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యచరణలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "వెల్ఫేర్ వీక్" (సంక్షేమ వారోత్సవం) నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని కాశ్మీర్ గడ్డ ఉమెన్స్ డిగ్రీ కళాశాల సమీపంలోని ఎస్సీ వెల్ఫేర్




హాస్టల్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించిన ఆయన, విద్యార్థుల గదులు మరియు మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో కలిసి హాస్టల్ ఆవరణలో పరిశుభ్రత పనులు నిర్వహించారు. చెత్తాచెదారం, కలుపు మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో ఉన్నప్పుడే చదువుపై దృష్టి సారించగలరని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నగరంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. హాస్టల్ అధికారులు, సిబ్బంది తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సువార్త, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎంహెచ్ఓ సుమన్, సానిటేషన్ సూపర్‌వైజర్లు శ్యామ్‌రాజ్, అనిల్, ఎస్సై వెంకన్న, హాస్టల్ సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి ) కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ కరీంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. నగరంలోని తెలంగాణ చౌక్‌లో టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు



కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రపూరితంగా ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ నివేదికలో అనేక లోపాలున్నాయని, ఆ నివేదిక ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే అవకాశముందని భావించి, గత రెండున్నరేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి, రిపేరింగ్ పేరిట హడావుడి సృష్టించారని రేవంత్ రెడ్డి పై విమర్శలు గుప్పించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కథలాపూర్, ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి): మండలంలోని తకళ్ళపెల్లి ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూపెల్లి రాజగంగారం, ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు,



మధ్యాహ్న భోజనం అందిస్తోందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు ఇవ్వనుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాజగంగారం కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వార్డు మెంబర్లు, కార్యదర్శి పూజిత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక మద్యం సేవించి వడదెబ్బతో వ్యక్తి మృతి

ధర్మారం(ధర్మపురి), ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి న్యూస్): ధర్మపురి పట్టణ పరిసర ప్రాంతంలోని కమలాపూర్ ఫ్లాట్స్ వద్ద బుధవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది.ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం అందడంతో ధర్మపురి సర్కిల్ ఇన్ స్పెక్టర్ రామ్ నరసింహారెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్ మహేష్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం,మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చీరాల ప్రాంతానికి చెందిన యోహాన్ అలియాస్ మహేష్



(28)గా గుర్తించారు. ఉపాధి కోసం ధర్మపురికి వలస వచ్చి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది.ప్రాథమిక సమాచారం మేరకు, మృతుడు అధికంగా మద్యం సేవించడం వల్ల ఎండ తీవ్రతకు గురై తుమ్మ చెట్టు కింద పడిపోవడంతో వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించండి

## గుల్లకోటలో కొనసాగిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం

ఎండపల్లి, ఏప్రిల్ 22,,ప్రజా జ్యోతి: ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి అని నాణ్యమైన విద్యా అందుతుంది అని ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్,ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి అన్నారు, ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లల నమోదు కొరకై,విద్యార్థుల సంఖ్యను పెంచడం తోపాటు చదువుకు దూరమైన పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు,మండలంలోని గుల్లకోట గ్రామంలో బుధవారం రోజున ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత, చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ, విద్యార్థులను పాఠశాలలో చేర్పించేలా,తల్లిదండ్రులను ప్రోత్సహిస్తూ ఉపాధ్యాయ బృందం ఇంటింటికి వెళ్లి, విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు ,ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు సమతుల్య ఆహారం, ఉచితంగా నాలుగు రకాల రంగురంగుల దుస్తులు విద్యాధికులు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన రాష్ట్రంలోనే ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత



రాజిరెడ్డి నిర్వహణలో అందిస్తున్న నాణ్యమైన విద్య, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, తల్లిదండ్రులకు వివరించి పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలో చేరేలా, ప్రోత్సహిస్తున్నారు, ఆటపాట్ల ద్వారా విద్యా బోధన విజ్ఞాన విహారయాత్రలు ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యా బోధన వనమహోత్సవం పలు సాంస్కృతిక కార్యక్రమాలు , నిర్వహిస్తూ,ప్రత్యేక కార్యక్రమాలతో ఆకట్టుకుంటు రాష్ట్రంలోనే ఉత్తమ ప్రాథమిక పాఠశాలగా పేరుగాంచిందని ,పూర్వ ప్రాథమిక తరగతి నిర్వహిస్తూ జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు,
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, రమాదేవి ,మాలతి, నరేష్ కుమార్,కృష్ణారెడ్డి, ప్రశాంత్, శ్రీలత,పూర్వ ప్రాథమిక శిక్షకురాలు శిరీష,విద్యార్థులు తల్లిదండ్రులు, పాల్గొన్నారు,

# తాడూర్ గ్రామంలోని అంగన్వాడి సెంటర్ లో పోషణ పక్వాడ్ కార్యక్రమం

తంగళ్ళపల్లి ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) : తంగళ్ళపల్లి మండలం తాడూర్ గ్రామంలోని అంగన్వాడి సెంటర్ లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు అంగన్వాడి సెంటర్లో నేర్చుకున్న ఆట పాటల తో కూడిన విద్య గురించి మరియు ప్రైవేటుకు దీటుగా అంగన్వాడి సెంటర్లు ఎలా నడుస్తున్నాయని వివరించారు. పిల్లలకు శారీరకంగా మానసికంగా పిల్లల అభివృద్ధి అనేది అంగన్వాడీ కేంద్రాలలో నే జరుగుతుందని మరియు చిన్న కండరాల పెద్ద కండరాల అభివృద్ధి కూడా జరుగుతుంది అని తెలిపారు.
పిల్లలను ముఖ్యంగా మొబైల్స్ కు దూరంగా ఉంచాలని మొబైల్ స్క్రీన్ నుంచి వచ్చే రేడియో తరంగాలు వలన పిల్లల కంటి చూపు పై మరియు మెదడుపై ఒత్తిడి పెరిగి శారీరకంగా అభివృద్ధి చెందకుండా మానసికంగా క్రుంగిపోతారు అని వచ్చే ఈ వేసవికాలంలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అశ్రద్ధ చూపరదని తెలిపారు. గర్భిణీలకు శ్రీమంతలు, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డిమల్ల సదానందం,ఉప సర్పంచ్ కోస్ని శ్రీధర్,అంగన్వాడి సుపర్ వైజర్ సౌజన్య,టీచర్స్ కొండికొప్పల పద్మ, పాశం సరళ,ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీ సభ్యులు వాసవి,స్రవంతి,అవంతిక, కావ్య,సుమలత,సునీత,లక్ష్మీ పాల్గొన్నారు.

# గరుడ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా

ముస్తాబాద్, ఏప్రిల్ 22( ప్రజా జ్యోతి): ముస్తాబాద్–పోతుగల్ రోడ్డులో ఉన్న బ్రహ్మసూత్ర శివలింగం జంగమయ్య శివాలయంలో గరుడ స్తంభం స్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల మధ్య



కనుల పండుగగా జరిగింది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ, వేద మంత్రాల నాదంతో ఆధ్యాత్మిక వాతావరణం అలరించింది. ఈ సందర్భంగా పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, గరుడ స్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. గ్రామస్థులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. మహిళలు మంగళహారతులు పట్టి, భక్తి గీతాలతో కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేశారు. గరుడ స్తంభం ప్రతిష్ఠాపనతో ఆలయానికి మరింత మహిమాన్వితత చేకూరిందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో స్థానిక ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తానికి ఈ గరుడ స్తంభం స్థాపన మహోత్సవం ముస్తాబాద్ ప్రాంతంలో ఒక ఆధ్యాత్మిక పండుగలా సాగి భక్తుల మనసులను హత్తుకుంది.గరుడ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా ముస్తాబాద్–పోతుగల్ రోడ్డులో ఉన్న బ్రహ్మసూత్ర శివలింగం జంగమయ్య శివాలయంలో గరుడ స్తంభం స్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల మధ్య కనుల పండుగగా జరిగింది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ, వేద మంత్రాల నాదంతో ఆధ్యాత్మిక వాతావరణం అలరించింది. ఈ సందర్భంగా పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, గరుడ స్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. గ్రామస్థులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. మహిళలు మంగళహారతులు పట్టి, భక్తి గీతాలతో కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేశారు. గరుడ స్తంభం ప్రతిష్ఠాపనతో ఆలయానికి మరింత మహిమాన్వితత చేకూరిందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో స్థానిక ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తానికి ఈ గరుడ స్తంభం స్థాపన మహోత్సవం ముస్తాబాద్ ప్రాంతంలో ఒక ఆధ్యాత్మిక పండుగలా సాగి భక్తుల మనసులను హత్తుకుంది.

# న్యూమరేటర్లు బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి

## – మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ,ఏప్రిల్,22:ప్రజాజ్యోతి. జనగణన – 2027ను సూపర్ వై జర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతా యుతంగా పూర్తి చేయాలని ము న్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అ న్నారు. జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సి స్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల కు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఆఖరి రోజు శిక్షణ కొనసాగుతుండగా, చైర్మన్ పుల్కం రాజు జన గణనకు సంబం ధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రతి కుటుం బం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని, అందరి వివ రాలుగోప్యంగాఉంచాలని,వార్డులలో కుటుంబాల వివరాల సేకర ణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న కౌన్సిలర్లకు గాని వార్ ఆఫీసర్లకు గాని కౌన్సిలర్లకు తెలుపగలరు. ఎండాకాలంనేపథ్యంలోఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకో వాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగాసేకరించి నమో దు చేయాలని అన్నారు. <ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎలిమినేటర్స్, ట్రైనర్స్, తదిత రులు పాల్గొన్నారు.

# ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం – ఉపసంహరణకు డిమాండ్

ముస్తాబాద్, ఏప్రిల్ 22( ప్రజా జ్యోతి): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండల బీజేపీ నాయకులు బుధవారం ముస్తాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు.
ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో బీజేపీపై విమర్శలు చేస్తూ ఖర్గే ప్రధాని మోదీని ఉద్దేశించి అనుచిత



పదజాలం ఉపయోగించారని ఆరోపించారు. దేశ ప్రజల మద్దతుతో వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికైన నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, ఇటీవల బీజేపీ మరియు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు విమర్శించారు. ఖర్గే వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ కూడా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

# వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

## రైతులకు మద్దతు ధర లాభం పొందాలి: తలారి రాణి నర్సింలు

ముస్తాబాద్, ఏప్రిల్ 22 ( ప్రజా జ్యోతి): ముస్తాబాద్ మండలంలోని పోతుగల్, ముస్తాబాద్, తెర్లుమద్ది, మొర్రాపూర్, గన్నవానిపల్లి, సేవాలాల్ తండా, వెంకట్రావుపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈరోజు ఘ న ంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్



కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ( ఎం ఎస్ పి ) తేమ ధాన్యాన్ని విక్రయించి, ఆర్థికంగా లాభపడాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపడుతోందని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, డైరెక్టర్లు ప్రతాపరెడ్డి, క్యారం రాజు, కదిరి సత్య గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు మరియు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు పాల్గొన్నారు.

### రేపు గేటుకారేపల్లిలో
# రెండు మండల స్థాయి క్రికెట్ పోటీలు

గుడిపూడి తిరుమలరావు




**కారేపల్లి, ఏప్రిల్ 22, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని గేట్ కారేపల్లి గ్రామములో రేపు అనగా శుక్రవారం రోజు సింగరేణి- కామేపల్లి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబడని గేట్ కారేపల్లి గ్రామానికి చెందిన ఎన్నారై గుడుపూడి తిరుమల రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నానమ్మ క్రీస్తు శేషులు గుడిపూడి వెంకట రామమ్మ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంటు నిర్వహించబడుచున్నది. ఈ టోర్నమెంట్ గ్రామ యువత సాయి, రమేష్,కమలాకర్, విజయ టీము ఆధ్వర్యంలో నిర్వహించబడును. పాల్గొన్నదలచిన క్రికెట్ క్రీడాకారులు వారిని సంప్రదించి టోర్నమెంట్లో పాల్గొనగలరని ఆయన కోరారు. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 25000 రెండో బహుమతి 15000 మూడో బహుమతి 10000 గా ప్రకటించడమైనది. ఆటలో పాల్గొనదలిసిన వారు ఒక్క టీం కి 600 రూపాయలు కమిటీ వారికి ఫీజు చెల్లించి పాల్గొనగలరని ఆయన తెలిపారు. ఈ టోర్నమెంటుపై తుది నిర్ణయం యువత టీం నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. ఈ టోర్నమెంట్ శుక్రవారం రోజు సాయంత్రం నాలుగు గంటలకు గేట్ కారేపల్లి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు ప్రాంగణంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించబడును, ఉత్సావంతమైన క్రికెట్ క్రీడాకారులు, అభిమానులు పాల్గొని ఈ టోర్నమెంట్ను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. సంప్రదించవలసిన ఫోన్ 789399 0284, 7989797987, 800850 2443, 9705291266 నెంబర్లు అని తెలిపారు.

### సింగరేణి పివిఎన్ కాలనీపై
# దృష్టి సారించండి: ఐఎన్‌టియుసి కోటి



**సత్తుపల్లి ఏప్రిల్22(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి పి.వి.ఎన్ సింగరేణి క్వార్టర్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరిని ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఎండాకాల దృష్ట్యా, వేసవి సెలవుల కారణంగా క్వార్టర్స్ నుండి సెలవులకు ఎక్కువమంది వెళ్లే అవకాశాలు ఉన్నాయి కాబట్టి, అదే అదునుగా తీసుకొని దొంగలు దొంగతనాలు చేస్తున్నారని, దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, భద్రత పెంచాలని , అనుమానస్పద వ్యక్తులపై గుర్తించి ఎంక్వయిరీ చేయాలని, ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా సిఐ స్పందిస్తూ వేసవి సెలవులు దృష్ట్యా దూర ప్రాంతాలకు వెళ్లే వాళ్ళు,విలువైన వస్తువులు బ్యాంక్ లాకర్ లో పెట్టుకోవాలని, క్యాష్ తక్కువగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయనను కలిసిన వారిలో ఇక్బాల్,అజీజ్ లు ఉన్నారు.

# ఎండ తీవ్రతకు జాగ్రత్తలు పాటించండి


– బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ



**బోనకల్, ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి):** వేసవిలో ఎండ తీవ్రత క్రమంగా పెరిగే క్రమంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నదని , కాబట్టి బోనకల్ గ్రామ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ ప్రజలకు సూచించారు. ముఖ్యంగా బడి పిల్లలకు సెలవులు ఇస్తున్న కారణంగా మే నెలలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలుపుతున్న కారణంగా పిల్లలను తల్లిదండ్రులు బయటకు పంపకూడదని, ఏదైనా అత్యవసర సమయం అయితే బయటకు వెళ్లాలని, అదేవిధంగా పిల్లలకు బావుల్లో, కాలువల్లో, చెరువుల్లో ఈతకు వెళ్లే ఆలోచనలు వస్తాయని కాబట్టి తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ కోరారు. అదేవిధంగా పెద్దవాళ్లు కూడా ఎండ తీవ్రతకు అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని లేనిపక్షంలో ఇంట్లోనే ఉండాలని కోరారు. అనవసరంగా ఎండ తీవ్రతకు బయటకు వెళ్లి అనారోగ్యాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు.

### మతిస్థిమితం లేని
# యువకుడు ఆయుధాలతో హల్‌చల్

– నగ్నంగా ప్రదర్శనలు – చెట్లు జేసీబీలు ఎక్కి ఆరుపులు కేకలు
– భయంతో వణికిపోతున్న తండా వాసులు





**నేలకొండపల్లి, ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి:** ఓ మితిస్థితిం లేని యువకుడు... గత రెండు రోజులుగా హల్చల్. చేస్తున్నాడు...వస్త్రాలు లేకుండా... ఆయుధాలు చేతపట్టి...కనిపించిన చెట్లు... వాహానాలను ఎక్కి... ఆరుపులు, కేకలతో వణికిపుట్టిస్తున్నాడు...దీంతో తండా వాసులు కంటిమీద కునుకు లేకుండా భయంతో జాగారం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా కు చెందిన జీ.నాగేశ్వరరావు (25) అనే మతిస్థిమితం లేని యువకుడు కు ఇటీవల తను రెగ్యూలర్ గా వాడే ' మాత్రలు అయిపోవటంతో.... వింతగా... విచిత్రంగా వ్యవహరిస్తున్నాడు. నగ్నంగా గ్రామంలోని పలు వీధుల వెంట తిరుగుతున్నాడు....చేతిలో ఆయుధాలు పట్టుకుని పరుగులు తీస్తుండు...కనిపించిన చెట్లు, వాహానాలు ఎక్కుతూ...హల్చల్ చేస్తున్నాడు... ఆరుపులు, కేకలతో ప్రజలకు వణుకుపుట్టిస్తున్నాడు. రాత్రి వేళ్లలో ఏ వీధి వైపు వస్తాడోనని ఆందోళన తో ప్రజలు కంటిమీద ' కునుకులేకుండా భయంతో జాగారం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానికులు మతిస్థిమితం లేని యువకుడు ను పట్టించుకుని...తగిన వైద్యం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రైతులకు బేడీలు వేసిన మీరా రైతుల గురించి మాట్లాడేది

– రైతు పక్షపాతి ప్రభుత్వం.. రుణమాఫీ, బోనస్ అందిస్తున్నాం
– రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి





**నేలకొండపల్లి, ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి :** రైతులకు బేడీలు వేసిన చరిత్ర కలిగిన వారు... రైతుల గురించి మాట్లాడుతుంటే హస్యాస్పదంగా ఉందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కోన్నారు. మండలం లోని నాచేపల్లి సోసైటీ ఆధ్వర్యంలో బౌద్ధక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన " మాట్లాడారు... వరి వేస్తే ఉరి అన్న గత పాలకులు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. రైతులకు బేడీలు వేసి నడిపించిన పాలకులు వారి గత చరిత్ర ను గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు చేప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు వినే పరిస్థితి లో లేరని అన్నారు. వరి కి రూ.500 బోనస్ ను ఇవ్వటంతో పాటు, 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల ను రుణమాఫీ ని అందించినట్లు తెలిపారు. గతంలో రైతు బంధు కు రూ.10 వేలు ఇస్తే... ప్రస్తుతం రూ.12 వేలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతు పక్షపాతి ప్రభుత్వం అన్నారు. ఇంకా మరో నాలుగు ఎన్నికలు జరిగినా ప్రజలు కాంగ్రెస్ ను దీవిస్తారని అన్నారు. రైతులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితులలో అనుకూలించకపోయినా... ప్రభుత్వం ఇచ్చిన మాట ను నిలబెట్టుకుంటున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంట ను నిల్వచేసుకునేందుకు వీలుగా 200 శాతం పెంచేలా కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ప్రవేట్ రంగం కు దీటుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలను నిర్మించి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, బస్సు ప్రయాణం లాంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధి తో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతును రాజు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతుల గురించి గత పాలకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, స్థానిక నాయకులు కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజినీ, వెంకన్న. బొందయ్య, భద్రయ్య. నంబూరి రామారావు. వేగినాటి లక్ష్మినర్సయ్య, కర్ల ఆశోక్, పాకనాటి క న్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్. కొమ్మినేని విజయాబాబు, కడియాల నరేష్, నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వెంకన్న, బొందయ్య, భద్రయ్య, నంబూరి రామారావు, వేగినాటి లక్ష్మినర్సయ్య, కర్ల ఆశోక్, పాకనాటి క న్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్, కొమ్మినేని విజయ్బాబు, కడియాల నరేష్, రాయపూడి రోహిత్, వివిధ పంచాయతీల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు
# మెరిట్ ఉపకార వేతనాలు విద్యార్థి ప్రోత్సాహక నగదు అందజేత

– ప్రభుత్వ బడిని ప్రోత్సాహించటం చాలా సంతోషం.. ఏయంఓ ప్రభాకర్రెడ్డి





**నేలకొండపల్లి, ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, నగదు ప్రోత్సాహక నగదు, మరియు మెరిట్ స్కాలర్ షిప్ లను అందించారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించి ప్రభుత్వ బడికి సహకరిస్తున్నారు. గ్రామానికి చెందిన కోరారు వెంకటేశ్వర్లు, ఏటుకూరి పుల్లయ్య కుటుంబ సభ్యులు విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్థానిక లి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మొత్తం 40 మందికి ప్రతీ ఏటా రూ.1,000 చొప్పున ప్రతీ ఏటా అందించనున్నారు. అదే విధంగా ప్రతీ తరగతి లో ప్రతిభ చూపిన మొదటి స్థానం కు రూ.2 వేలు, రెండో స్థానం సాధించిన విద్యార్థులకు రూ.1,000 చొప్పున మెరిటి స్కాలర్స్ ఫిప్ లను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్రెడ్డి చేతుల మీదుగా అందించారు. అనంతరం బడి బాట కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... ప్రభుత్వ బడి ని బలోపేతం చేసేందుకు స్థానికులు చేస్తున్న కృషి ని ప్రసంశించారు. ఇలాంటి వారు మరింత మంది ముందుకు వచ్చి విద్యాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. కాగా విద్యార్థులకు ప్రతీ ఏటా ఇదే మాదిరిగా అందిస్తామని దాతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్, సర్పంచ్ సైదులు, మాజీ సర్పంచ్ కోటి శ్రీనివాసరావు, దాతలు ఏటుకూరి వెంకయ్య, సునందాదేవి, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాందాసు, ఉపాధ్యాయులు ఇటిక్యాల సురేష్, రఫీయుద్దన్, నారాయణరావు, కళ్యాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించండి


– అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించకండి – పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించండి
– దళారీల మాటలు నమ్మి మోసపోకండి – మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య



**బోనకల్, ఏప్రిల్ 22(ప్రజా జ్యోతి):** నూతన విద్యా సమత్సరం ప్రారంభించబడుతున్న సమయంలో మండలంలోని విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను సదివించాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలు పొందుకోవాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను పిల్లలు అనుభవించేలా చూడాలని తల్లిదండ్రులకు మండల విద్యాశాఖ అధికారి దామల పుల్లయ్య ప్రతేకంగా కోరారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల వారు మీ పిల్లలను వారి పాఠశాలలో చేర్చడానికి మీ వద్దకు వస్తుంటారనీ అన్నారు. మన మండలం లో రికగ్నిషన్ కలిగిన పాఠశాలలు 4 హై స్కూల్స్ , 2 ప్రైమరీ స్కూల్స్ కి మాత్రమే అనుమతులు ఉన్నాయని తెలియజేశారు. కాబట్టి తల్లిదండ్రులు అలోచించి అర్హత కలిగిన పాఠశాలలలో మాత్రమే మీ పిల్లలను చేర్పించాలని కోరారు. అదేవిధంగా నాణ్యత కలిగిన విద్యాలయాలలో మాత్రమే చదివించి పిల్లల భవిష్యత్తుకు బంగారుపాటవేయాలని అన్నారు. దళారీల మాటలు నమ్మి మోసపోకూడదని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం మీ వద్దకు వచ్చినప్పుడు స్కూల్స్ రికగ్నిషన్ , రెన్యూయల్ అడగాలని సూచించారు. ఒక్క సమయంలో వారి మాయమాటలు నమ్మి మోసపోకండనీ కోరారు. రికగ్నిషన్ ,రెన్యూయల్ లేకుండా బొగస్ పాఠశాలల వారు తల్లిదండ్రులను తప్పు దారి పటిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామనీ మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య హెచ్చరించారు.

# సాగునీటి కల సాకారం దిశగా తుమ్మల అడుగులు

- సీతారామ ప్రాజెక్టు కాల్వ పనుల పరిశీలన.. అధికారులకు దిశానిర్దేశం
– కమలాపురం నుంచి తొట్టి పంపు వరకు పనుల తనిఖీ – రైతులకు త్వరితగతిన నీరు అందించాలన్న సూచన







**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 22, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధికి అనుసంధానంగా సాగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను మంత్రి తుమ్మల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని కమలాపురం నుంచి అన్నపురెడ్డిపల్లి మండలంలోని తొట్టి పంపు వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర కొనసాగుతున్న కాల్వ నిర్మాణ పనులను స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ, అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న మంత్రి తుమ్మల, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువులోపు పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా భూసేకరణ, సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు.కాల్వ నిర్మాణ పనుల వేగాన్ని మరింత పెంచాలని, ప్రతి దశను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. రైతులకు త్వరితగతిన ప్రాజెక్టు ప్రయోజనాలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలన తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతులకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. సాగునీటి వసతులు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తి పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టుల పూర్తి దిశగా కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జగద్గురువుల ఆరాధన ఉత్సవంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి : భగవత్ రామానుజా చార్యుల వారి 1009 వ జయంతి ఎన్ ఎఫ్ సి రామానుజ కూడలిలో స్వామి విగ్రహం వద్ద అభిషేకాది కైంకర్యాలు



వైభవంగా జరిగాయి. జగద్గురువుల ఆరాధనా ఉత్సవంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యుడు బండారి లక్ష్మారెడ్డి అనంతరం స్వామి వారి నివేదిత ప్రసాద వితరణ జరిగింది డా. ధనుంజయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోమాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్ శ్రీనివాస్ రెడ్డి అంజయ్య వంజరి ప్రవీణ్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

మొదటిపేజీ తరువాయి..

ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్ ్ ÷ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్‌÷ర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

### మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్ రావు మృతి

మొదటిపేజీ తరువాయి..



ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్



మొదటిపేజీ తరువాయి..

చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కొత్తిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్– ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్– రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.

### సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

మొదటిపేజీ తరువాయి..

త్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

మొదటిపేజీ తరువాయి..

విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ములా వన్ రేస్ పేరు మీద చేసిన ఖ ర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'డూప్ ్ ÷టింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వారిని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. గత రెండున్నరేళ్లుగా రాష్టాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోందని ఆరోపించారు.

అందుకనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కాంగ్రెస్ సర్కార్ వెనుకాడుతోందని విమర్శించారు. ఇది రేవంత్‌రెడ్డి పరిపాలనా వైఫల్యమని, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహమని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? అని నిలదీశారు.

### నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

కార్యాచరణను ఖరారు చేసేందుకు కేబినేట్‌లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు.

కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

## అన్ని మతాచారాలను ఒకే గాటిన కట్టలేం

మొదటిపేజీ తరువాయి..

ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది.



మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం తీసుకునే నిర్ణయం మతపరమైన హక్కుల విషయంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.






Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967